విశాఖపట్టణం
శుక్రవారం 17 అక్టోబర్ 2025
For a pure tomorrow..
జయ జయహే
jayajayahey.in సంపుటి: 8 సంచిక: 257 వెల: రూ.5/- పేజీలు: 12
Published From Visakapatnam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurno

# ఈశాన్యం.. ఎంట్రీ నైరుతి నిష్క్రమణ

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

ప్రత్యేకప్రతినిధి, జయజయహే

ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తమిళనాడు, కర్ణాటక, కేరళ పాండిచ్చేరిలో ప్రభావం చూపించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దక్షిణ కోస్తా తీరం వెంబడి 35-45కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ..మిగతా 2లో



# గుజరాత్‌లో కీలక పరిణామం

- ముఖ్యమంత్రి మినహా మంత్రులంతా రాజీనామా!
- ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా తప్పుకున్న మంత్రులు
- మధ్యాహ్నం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా రాజీనామా



2

# ట్రంప్-మోదీ మధ్య సంభాషణ జరగనేలేదు

- రష్యా చమురు అంశంపై విదేశాంగ శాఖ
- రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపేసేందుకు మోదీ అంగీకరించారన్న ట్రంప్
- అలాంటి చర్చ జరగలేదన్న విదేశాగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్
- ఇప్పటికే కేంద్రం స్పష్టతనిచ్చిందని వెల్లడి



2





# వికసిత్ భారత్ సాధిస్తాం

## డబుల్ ఇంజిన్ సర్కారు దూసుకుపోతోంది



- బాబు, పవన్ శక్తివంతమైన నాయకత్వం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- శ్రీశైలం మల్లికార్జున స్వామికి పూజలు

శ్రీశైలం - జయజయహే

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ప్రధాని మోదీ.. సభా వేదికపై నుంచి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం 13వేల 430కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేష్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. అనంతరం స్పీచ్ ప్రారంభించిన మోదీ.. సోదర సోదరీమణులకు నమస్కారాలు అంటూ తెలుగులో స్పీచ్ ప్రారంభించారు. అహోబిలం నర్సింహస్వామి , మహానంది ఈశ్వరుడిని నమస్కరిస్తున్నా అన్నారు మోదీ. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నట్లు చెప్పారు. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన ..మిగతా 2లో



## మోడీ లాంటి నేతను ఇప్పటివరకు చూడలేదు

- మనందరి భవిష్యత్తు కాపాడే నేత ఆయనే
- జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఎంతో మేలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కర్నూలు, జయజయహే

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ మనందరి భవిష్యత్తును కాపాడే నేతని.. సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 25 ఏళ్లుగా దేశానికి అద్భుతంగా అహర్నిశలు సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు మోదీ లాంటి నేతను చూడలేదని చంద్రబాబు పేర్కొన్నారు. మాటలతో కాదు చేతలతో చూపించే నాయకుడు మోదీ అన్నారు. సూపర్ జీఎస్టీ తో సూపర్ సేవింగ్.. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ అంటూ సీఎం చంద్రబాబు ..మిగతా 2లో


# గూగుల్‌పై పాలిటిక్స్!




- విశాఖకు డాటా సెంటర్ పై రాజకీయ రచ్చ
- బాబు బ్రాండ్ నే అంటున్న కూటమి
- జగన్ విజన్ వల్లేనని వైసీపీ ఉద్ఘాటన

విశాఖపట్నం - జయజయహే

డెవలప్‌మెంట్‌కు గేమ్‌ఛేంజర్. ఏకంగా లక్షా 80వేల ఉద్యోగాలు..ఒక లక్షా 30వేల కోట్ల పెట్టుబడులు. విశాఖలో ఏర్పాటు చేయబోయే గూగుల్ ఏఐతో జరిగే ప్రయోజనం ఇదంటూ కూటమి చెప్పుకొస్తోంది. విపక్ష వైసీపీ రియాక్షన్ మాత్రం ఆసక్తికరంగా..పొలిటికల్ ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. తమ హయాంలోనే అదానీతో ఒప్పందం చేసుకున్నామని చెప్తోంది వైసీపీ. గూగుల్ ఏఐతో పెద్దగా ఉద్యోగాలు రావని కూడా అంటోంది. గూగుల్ డేటా సెంటర్‌పై ఎందుకీ పొలిటకిల్ హైడ్రామా? ఏపీలో వైసీపీ ఇలా..కర్ణాటకలో మంత్రులు అలా..ఎందుకలా.? అనే చర్చ సాగుతోంది. విశాఖ గూగుల్ డేటా సెంటర్. ఇప్పుడిది ట్రెండింగ్ టాపిక్. పెట్టుబడుల పరంగా..అతిపెద్ద కంపెనీ విశాఖ వస్తున్న సందర్భంగా..ఇంట్రెస్టింగ్ అంశంగా నడుస్తోంది. సేమ్‌టైమ్ విశాఖ గూగుల్ డేటా సెంటర్ కూడా అన్ని అంశాల లాగే..పొలిటికల్ టాపిక్‌గా..క్రెడిట్ వార్‌లో భాగంగా ఓ ఇష్యూ అయిపోయింది. ఓ వైపు ఏపీకి ..మిగతా 2లో



## లండన్‌కు చంద్రబాబు

- నవంబర్ 2న పయనం
- విశాఖ ఇన్వెస్టర్ సమ్మిట్ సక్సెక్ కోసం యత్నాలు
- ప్రపంచ వ్యాపారవేత్తలతో భేటీ కానున్న సీఎం

అమరావతి, జయజయహే

సీఎం చంద్రబాబు నవంబర్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు లండన్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. అనంతరం నవంబర్ 14, 15న విశాఖలో భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా సదస్సుకు రావాలని లండన్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం కోరనున్నారు. రాష్ట్రంలో ..మిగతా 2లో

# మరో 15 ఏళ్లు అధికారం మాదే

## ఇబ్బందులున్నా తట్టుకుని నిలబడతాం

- మోదీ నాయకత్వంలో సమిష్టిగా ముందుకు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

శ్రీశైలం, జయజయహే

ప్రధాని మోదీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ధర్మాన్ని పాటిస్తూ కర్మను పాటించే నాయకుడు మోదీ అని అన్నారు. కర్నూలులో జరిగిన జీఎస్టీ 2.0 సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్.. ప్రధాని మోదీని కర్మయోగి అని అన్నారు. ఎలాంటి ఫలితాలను ఆశించకుండా సేవ చేస్తున్నారని.. భారత్‌ను అగ్రగ్రామిగా నిలుపుతున్నారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఏపీలో కూటమి 15 ఏళ్లకు తక్కువ కాకుండా బలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తట్టుకుని నిలబడి ఉంటామని చెప్పారు. మోదీ నాయకత్వంలో సమిష్టిగా ముందుకు వెళ్తామని పవన్ అన్నారు. ఇక జీఎస్టీ వల్ల అన్ని వర్గాలకు మేలు జరురగు తుందని పవన్ ..మిగతా 2లో



For a pure tomorrow..

# వికసిత్ భారత్ సాధిస్తాం

మొదటి పేజీ తరువాయి...

గుజరాత్‌లో నేను జన్మించాను.. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించిందన్నారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం.. సంస్కృతికి నిలయంగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ రూపంలో.. రాష్ట్రానికి శక్తివంతమైన నాయకత్వం ఉందన్నారు పధాని మోదీ. కేంద్రం నుంచి కూడా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. 16 నెలల్లో అభివృద్ధి డబుల్ ఇంజిన్‌లా దూసుకుపోతోందన్నారు. అభివృద్ధికి ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా నిలుస్తాం అని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం అన్నారు ప్రధాని. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుందన్నారు. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకమన్నారు. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుందన్నారు. దేశంలోని ప్రతి గ్రామంలో విద్యుద్దీకరణ జరిగిందన్నారు ప్రధాని మోదీ. తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగిందన్నారు. ఇళ్లతో పాటు పరిశ్రమలకు తగిన విద్యుత్ అందుతోందన్నారు. సహజ వాయువు పైప్‌లైన్‌తో 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. చిత్తూరు ఎల్‌పీజీ బాటిలింగ్ ప్లాంటుకు రోజూ 20 వేల సిలిండర్లు



నింపే సామర్థ్యం ఉందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు.. మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సబ్బవరం-షీలానగర్ హైవేతో కనెక్టివిటీ మరింత మెరుగవుతుందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ప్రధాని చెప్పారు. ఈ సంకల్పానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం మరింత శక్తినిస్తుందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారులో సామర్థ్యాన్ని మరింత పెంచుతామన్నారు. భారత్, ఏపీ వేగం, సామర్థ్యాన్ని యావత్ ప్రపంచం గమనిస్తోందన్నారు.

## కూటమిది అధికార మదం

### మహిళలపై కనీస గౌరవం కూడా లేదు

### వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపాటు

**విశాఖపట్నం, జయజయహే**

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు అధికార మదంతో మహిళలను అవమానించడం అలవాటుగా మారిందని వైయస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం వైయస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... 16 నెలల పాలనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల కాలకేయుల్లా మారారని, ముఖ్యమంత్రి చంద్రబాబు అండతోనే ఇంత నీచంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వైయస్సార్‌సీపీ మహిళా నేత కృపాలక్ష్మిపై అత్యంత నీచంగా మాట్లాడిన ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని, సీఎం చంద్రబాబు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ అంటే తెలుగు దురహంకార పార్టీగా మార్చేశారు. ఎంత మంది మహిళలను వేధించినా, అవమానించి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ల మద్దతు ఉంటుందన్న ధైర్యంతో సభ్యత, సంస్కారం మరిచి ప్రవర్తిస్తున్నారు. వైయస్సార్‌సీపీ జీ డీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మిపై ఎమ్మెల్యే థామస్ అత్యంత సంస్కారహీనంగా మాట్లాడారు. ఒక దళిత మహిళపై ఇంత నీచంగా ఎమ్మెల్యే ఏ ధైర్యంతో మాట్లాడుతున్నారు. మహిళలపై ఎంత నీచంగా మాట్లాడినా వారి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఏమీ అనరన్న ధైర్యంతోనే ఇలా మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే థామస్ ను సూటిగా ప్రశ్నిస్తున్నాను. మీ ఇంట్లో మహిళల గురించి కనీస సభ్యత లేకుండా ఇంత నీచంగా మాట్లాడగలరా ? మీ మహిళల గురించి ఎవరైనా ఇలా మాట్లాడితే మీరు మౌనంగా ఉంటారా? అడ్డదారిలో ఈవీఎంల సాయంతో ఎమ్మెల్యే అయిన థామస్.. లంచం లేనిదే నియోజకవర్గ ప్రజలకు ఏ పని చేయరని చెప్పుకుంటున్నారు. దేవుడి అంటే కూడా ఆయనకు లెక్కలేదు. అలాంటి వ్యక్తి మహిళలకు గౌరవం ఇస్తాడని ఆశించడం లేదు. జీ డీ నెల్లూరు వైయస్సార్‌సీపీ నేత కృపాలక్ష్మికి ఎమ్మెల్యే థామస్ కచ్చితంగా క్షమాపణ చెప్పాలని, ఇంత దారుణంగా మహిళ మీద దుర్భాషలాడిన అతని మీద చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుని డిమాండ్ చేస్తున్నాం. ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలపై పోలీస్ స్టేషన్ తో పాటు, ఎస్సీ కమిషన్, నేషనల్ ఉమెన్ కమిషన్ కు ఫిర్యాదు చేయనున్నాం అని వరుదు కల్యాణి ప్రకటించారు.

## ట్రంప్-మోదీ మధ్య సంభాషణ జరగనేలేదు

### రష్యా చమురు అంశంపై విదేశాంగ శాఖ

### రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపేసేందుకు మోదీ అంగీకరించారన్న ట్రంప్

### అలాంటి చర్చ జరగలేదన్న విదేశాగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

### ఇప్పటికే కేంద్రం స్పష్టతనిచ్చిందని వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. ఇటువంటి ఫోన్ సంభాషణ ఇరువురు దేశాధినేతల మధ్య జరగలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. ఈ విషయంపై భారత్ ఇదివరకే ఒక స్పష్టతనిచ్చిందని ఆయన తెలిపారు.

రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు నరేంద్ర మోదీ అంగీకరించారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం కాగా, భారత్ ఈ వ్యాఖ్యలను ఖండించింది.

ఇదివరకే కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ ప్రజల ప్రయోజనాలు తమకు ముఖ్యమని, వీటి ఆధారంగానే దిగుమతులు ఉంటాయని స్పష్టం చేసింది. అమెరికా నుంచి చమురు దిగుమతులు పెంచడానికి గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నామని, గత దశాబ్ద కాలంలో ఈ విషయంలో చాలా పురోగతి కనిపించిందని ఆ ప్రకటనలో పేర్కొంది.ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలపై కూడా భారత్ స్పందించింది. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ కేంద్రంగా మారిందని ఆరోపించింది. ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని మండిపడింది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని విమర్శించింది. ఆ రెండు దేశాల మధ్య ఘర్షణల నేపథ్యంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత్ పేర్కొంది.

## గూగుల్‌పై పాలిటిక్స్!

మొదటి పేజీ తరువాయి...

అతిపెద్ద పెట్టుబడి..దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు..లక్షా 30వేల కోట్ల పెట్టుబడులు అంటూ కూటమి చెబుతోంది. అందుకు తగ్గట్లే నేషనల్ హాట్ టాపిక్ అవుతోంది వైజాగ్ గూగుల్ డేటా సెంటర్. సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు, ఎడ్యుకేటెడ్ సెక్టార్ నుంచి మంచి రెస్పాన్స్ కూడా వస్తోంది. ఈ క్రమంలోనే గూగుల్ డేటా సెంటర్ చుట్టూ రాజకీయం రచ్చ చేస్తోంది. అటు కర్ణాటకలో గూగుల్ ఏఐ సెంటర్ చుట్టూ పొలిటికల్ దుమారం లేస్తోంది. సిద్ధరామయ్య సర్కార్ ఫెయిల్యూర్ వల్లే గూగుల్ ఏఐ సెంటర్ ఏపీకి తరలిపోయిందని అక్కడి ప్రతిపక్షాలు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నాయి. అయితే కర్ణాటక ఐటీ మినిస్టర్ ప్రియాంక్ ఖర్గే మాత్రం ఏపీ ప్రభుత్వం రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి గూగుల్ డేటా సెంటర్ ను తెచ్చుకుందని చెప్తున్నారు. అయినా బెంగుళూరే ఐటీ హబ్‌గా ఉందని అక్కడ ప్రభుత్వ పెద్దలు కవర్ చేసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ మాత్రం ట్విట్టర్ వార్ కోసం కాదు..పెట్టుబడుల కోసమే తమ సిన్సియర్ ప్రయత్నమంటున్నారు.

ఇటు ఏపీలోనూ గూగుల్ డేటా సెంటర్ చుట్టే రాజకీయం నడుస్తోంది. గూగుల్ డేటా సెంటర్‌లో విపక్ష వైసీపీ రియాక్షన్..చర్చకు దారితీస్తోంది. వైసీపీ హయాంలో ఐటీ మినిస్టర్ గా పని చేసిన గుడివాడ అమర్నాథ్ ఇచ్చిన స్టేట్ మెంట్‌పై డైలాగ్ వార్ నడుస్తోంది. డేటా సెంటర్లతో పెద్దగా ఉద్యోగాలు రావన్న ఆయన..గూగుల్ డేటా సెంటర్లతో నీటి కొరత వస్తుందని ఇంకో కామెంట్ చేశారు. అంతేకాదు కరెంట్ చార్జీలు పెరుగుతాయని చెప్పుకొచ్చారు. వైసీపీ తమ హయాంలోనే అదానీతో జగన్ ఇదే ఒప్పందం చేసుకున్నారని, ఇదేం కొత్తగా తెచ్చిందేం కాదని చెప్పుకుంటున్నారు. దీంతో వైసీపీ వాదనపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు కూడా దారితీస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని కొద్ది రోజులుగా జాతీయ, అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వచ్చినా సరే వైసీపీ కొట్టి పారేసింది.





గూగుల్ నుంచి అధికారక ప్రకటన లేకుండా మీడియాలో ప్రచారం చేసుకుంటే వచ్చేసినట్లేనా అంటూ అప్పట్లో వైసీపీ లీడర్లు..సెటైర్లు వేశారని గుర్తు చేస్తున్నారు టీడీపీ నేతలు. గూగుల్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకోవడంతో..గూగుల్ డేటా సెంటర్ విషయంలో వైసీపీ రియాక్షన్ ఇంకా మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో అదానీ కంపెనీ, ఎయిర్ టెల్ కూడా భాగస్వామ్యం అయ్యాయి. ఈ అంశాన్ని వైసీపీ అవకాశంగా అందిపుచ్చుకుంటుంది. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు జగన్ సీఎంగా ఉన్నప్పుడే ఒప్పందం కుదిరిందని వైసీపీ గుర్తు చేస్తోంది. ఆ ఒప్పందమే కాస్త విస్తరించి గూగుల్ వరకు వెళ్లిందని చెప్పుకొస్తోంది. అప్పట్లో జగన్, అదానీ కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. సేమ్‌టైమ్ డేటా సెంటర్లతో పెద్దగా ఉపయోగం ఉండదని తీసి పడేస్తోంది వైసీపీ. డేటా సెంటర్లతో పర్యావరణానికి హాని కలుగుతుందని కూడా చెబుతున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో గూగుల్ డేటా సెంటర్‌ను వైసీపీ స్వాగతిస్తుందా? లేక వ్యతిరేకిస్తుందా? అన్న అంశంపై క్లారిటీ లేదన్న టాక్ వినిపిస్తోంది. మరి వైసీపీ అధినేత జగన్ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.



## మరో 15 ఏళ్లు అధికారం మాదే

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధానికి 5కోట్ల ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గతంలో పన్నులు పెరగడమే అందరికీ తెలుసన్న పవన్.. మోదీ హయాంలో పన్నులు తగ్గడం చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ దేశాన్ని కాదు రెండు తరాలను నడుతుపుతున్నారని అన్నారు. అంతకుముందు మంత్రి నారా లోకేశ్ సైతం కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చింది మోదీనే అని అన్నారు. నమో అంటేనే విక్టరీ అని.. మోదీ ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమే అవుతుందని చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పారని.. మోదీ దెబ్బకు పాకిస్తాన్ దిమ్మతిరిగిందన్నారు. ట్రంప్ టారిఫ్‌లతో పెద్ద పెద్ద దేశాలు వణికినా.. మోదీ మాత్రం బెదరలేదని వ్యాఖ్యానించారు. దసరా, దీపావళి కలిసి వస్తే ఇలానే ఉంటుందన్నారు. మోదీ లక్ష్యం పేదరికం లేని దేశం అని.. అందుకోసం నిరంతం శ్రమిస్తున్నారని తెలిపారు.



## మోడీ లాంటి నేతను ఇప్పటివరకు చూడలేదు

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన మోదీకి ధన్యవాదాలు చెప్పారు. మనశక్తి ఏంటో ఆపరేషన్ సింధూర్‌తో మోదీ చూపించారని.. రాబోయే శతాబ్దాలకు మోదీ పునాది వేశారని చంద్రబాబు పేర్కొన్నారు. 2038నాటికి రెండో ఆర్థిక శక్తిగా ఎదుగుతామన్నారు. మాటలు కాదు, చేతల్లో చూపించే నేత అని.. ఇలాంటి నేతను తన రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. చాలామంది ప్రధానమంత్రులతో పనిచేశానని.. కానీ.. ప్రధాని మోదీ లాంటి వ్యక్తిని చూడలేదని చంద్రబాబు పేర్కొన్నారు. వన్ నేషన్, వన్ ట్యాక్స్, వన్ మార్కెట్ తెచ్చారని... జీఎస్టీతో ప్రతి కుటుంబానికి ఏటా రూ.15 వేలు ఆదా అవుతుందన్నారు. అన్ని వర్గాలకు మేలుచేసేలా మోదీ సంస్కరణలు ఉన్నాయన్నారు.

## లండన్‌కు చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి...

పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను వారికి క్లుప్తంగా వివరించనున్నారు. ముఖ్యంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను సీఎం వివరిస్తారు. సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా సైతం చంద్రబాబుతో పాటు లండన్ వెళ్లనున్నారు. ఈ మేరకు జీఏడీ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. ఈ సమ్మిట్ నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగోసారి జరగనుంది. గతంలో 2016, 2017, 2018 సంవత్సరాల్లో విశాఖపట్నం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు నాలుగోసారి అదే నగరంలో జరిగే ఈ సదస్సు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీస్తోంది. చంద్రబాబు అధికారులకు సూచిస్తూ విశాఖను సుందరంగా తీర్చిదిద్దాలి, విదేశీ అతిథులకు అత్యుత్తమ ఆతిథ్యం ఇవ్వాలి. ఈ సదస్సు ద్వారా ఏపీ పెట్టుబడుల గమ్యస్థానంగా నిలవాలని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా మారుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థలు రాష్ట్రంపై దృష్టి సారిస్తున్నాయి. త్వరలోనే ఏపీ కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువగా ఉండటంతో అధికారులు వేగంగా సన్నాహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సీఐఐ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఏపీని గ్లోబల్ ఎకానమిక్ మ్యాప్‌లో ముందుండే రాష్ట్రంగా మార్చాలన్నదే మా లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ, విశ్వాసం, వాణిజ్య భాగస్వామ్యం ఈ సదస్సు ప్రధాన సూత్రాలు అవుతాయని చంద్రబాబు అభిప్రాయాన్ని చేశారు. విశాఖ సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా, పెట్టుబడుల ప్రవాహానికి వేదికగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రగతిలో ఏపీ కీలక పాత్ర పోషించేందుకు సన్నద్ధమవుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా నిలవాలనీ, దానికోసం అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఇటీవలే చంద్రబాబు దిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

## ఈశాన్యం ఎంట్రీ.. నైరుతి నిష్క్రమణ

మొదటి పేజీ తరువాయి...

ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఏపీలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని సమాచారం.మరోవైపు తెలంగాణ లోని నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతోంది. అలాగే మరి కొన్ని జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి ఉరుములతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. కాగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల సమయంలో వాగులు, చెరువులు, కాల్వల దగ్గరికి వెళ్లరాదని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## గుజరాత్‌లో కీలక పరిణామం

### ముఖ్యమంత్రి మినహా మంత్రులంతా రాజీనామా!

### ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా తప్పుకున్న మంత్రులు

### మధ్యాహ్నం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

### పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా రాజీనామా

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. "ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తన మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం విస్తరించనున్నారు" అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మంత్రివర్గంలో దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని బీజేపీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. అంతేకాకుండా, ప్రస్తుత ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా, మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్నారు.

# బహుళ అంతస్థుల నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు?!





## కమీషనర్ రాహుల్ మీనా గారూ....

**రాజమహేంద్రవరం, జయజయహే :**

రాజమహేంద్రవరం నగరంలో ఏ సందులో చూసినా.. ఆకాశాన్ని తాకే భవంతులు. ఏ ప్రాంతానికి వెళ్లినా.. అడ్డగోలుగా నిర్మించిన బహుళ అంతస్తులు. నగరంలోని ఈ బహుళ నిర్మాణాల వెనుక అంతులేని దోపిడీ లు, అవినీతే, వెలుగు చూస్తోంది. జిల్లా కేంద్రమన్న భయం లేదు.. ఉన్నతాధికారులు ఉంటారనే కంగారు అసలే లేదు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ గుర్తించిన అక్రమాలపై కూడా వీళ్లకు పట్టదు. నిత్యం మామూలుగా సాగిపోయే.. నగర టౌన్ ప్లానింగ్, రుడా అధికారుల అవినీతి కట్టు కథలకు.. గత కమిషనర్, కలెక్టర్ల ఆదేశాలే చెక్ పెట్టలేకపోయారు. రాజకీయ దళారీలతో జోడి కట్టి, నగరాన్ని ఇరుకుమయం చేస్తున్న నగర ప్రణాళికను.. ప్రస్తుత కలెక్టరు, కమిషనర్ చైనా గాడిలో పెడతారా..? లేకా అయ్యా..ఎస్. అంటూ సర్దుకుపోతారా.. అన్న చర్చ సగరంలో సాగుతోంది. వందల్లో అక్రమ అంతస్తుల నిర్మాణాలు మూడుకు అనుమతి. కట్టేవి నాలుగైదు 6 అడ్డగోలు సంపాదనకు అలవాటుపడ్డ కొందరు అధికారులు, పర్సంటేజీల కోసం ప్రాకులాడే నేతలూ ఉన్నంత వరదూ.. మాకు దోకాలేదని నిరూపిస్తున్నారు. అక్రమ నిర్మాణ దారులు, జిల్లా కేంద్రమైన రాజమ హేంద్రవరం నగరంలో కొన్ని ళ్లుగా టౌన్ ప్లానింగ్ పూర్తిగా అదుపుతప్పింది. ఎక్కడ చూసినా. లెక్కకు మించి ఆక్రమ నిర్మాణాలు గాల్లోకి చేస్తున్నాయి.నిబంధనలకు పాతరేసి.. అనధికారిక కట్టడాలు మామూళ్ల ముసుగులో దర్జాగా సాగుతున్నాయి. కనీస అనుమతులు తీసుకోకుండానే కొందరు ఇక్కడ అనధికార భవంతులు నిర్మిస్తున్నారు. రాజకీయ అండతో కొందరు, మామూళ్ల మార్గంలో మరికొందరూ.. ఇష్టారాజ్యంగా భవంతులు కట్టుకుంటూపోతున్నారు. చాలా వరకూ నగర ప్రణాళిక విభాగం అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపోయిస్తున్నాయి. గతంలో సాక్షాత్తూ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రెండురోజులు చేపట్టిన తనిఖీల్లో ప్లానింగ్ అధికారుల గుట్టు రట్టయ్యింది. కొన్ని అక్రమ నిర్మాణాలను ఆశాఖ వెలుగులోకి తెచ్చింది. మరోపక్క గత కమిషనర్, కలెక్టర్లు సైతం వీటి అదుపుకు ప్రయత్నించారు. కానీ, రాజకీయ దన్ను ఆశాఖకే ఉండటమో.. మరే కారణమే గానీ, వాళ్ళ ప్రయత్నాలు విఫలమ య్యాయి. ఆఖరికి కలెక్టర్ ఆదేశించిన అక్రమ నిర్మాణాలు చిట్టా కూడా.. ఆమెకు చేరలేదు. ప్రస్తుతం ఆ కలెక్టర్, కమిషనర్ లు మారిపోయారు. దీంతో.. ఈ బహుళ మాఫియాకు చెక్ పెట్టడంపై.... ప్రస్తుత కలెక్టర్ కీర్తి చేకూరి, నూతన కమిషనర్ రాహుల్ మీనా లపైనే ఆశలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి కోట్లల్లో గండి : రాజమహేంద్రవరంలో ఇబ్బడిముబ్బడిగా అక్రమ కట్టడాలు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే.. సుమారు రెండువందలకు పైనే ఇవి ఉంటాయని సమాచారం. అనధికారికంగా అయితే ఇక లెక్కే లేదు. మహానగరంగా విస్తరిస్తున్న ఇక్కడ.. జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. నగరంలోనే నివాసం ఉండాలన్న జనాల ఆశలను ఆసరాగా



చేసుకుని అద్దెలు భారీగా పెంచేశారు. దీంతో ఎక్కువమంది అపార్టుమెంట్ల నిర్మాణం, కొనుగోళ్లపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే.. నిబంధనలకి పాతరేసి.. 150 నుండి 300 గజాల లోపు ఉన్న ఇరుకు స్థలల్లోనే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం నుండి రెసిడెన్సియల్ ప్లాన్తో అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలు నిర్మించుకుని లక్షల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో ఈ వ్యవహారాలు నిర్భీతిగా సాగుతున్నాయి. అయితే వాటిని నియంత్రించాల్సిన పట్టణ ప్రణాళిక బహుళ దోపిడీ విభాగం అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నగరంలో అధికారుల లెక్కల ప్రకారం రెసిడెన్సియల్ భవనాలు 64 వేలు ఉండగా.. కమర్షియల్ భవనాలు దాదాపు 14 వేలు ఉన్నట్లు సమాచారం. వాటిలోనే అక్రమ కట్టడాలు సుమారు వందల సంఖ్యలో ఉన్నాయి. ప్లాన్లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలైతే లెక్కేలేదు. ఈ లెక్కలు సంబంధిత అధికారుల వద్ద ఉన్నా.. వాటి పై కనీస చర్యలు కానరావు. వీటివల్ల వివిధ శాఖలకు, వివిధరూపాల్లో రావాల్సిన అధికారిక ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దొడ్డిదారుల్లో అధికారులు, పలువురు అధికార దళారీలు మామూళ్ల రూపంలో లక్షలు గుంజేస్తున్నారు. దీంతో.. అక్రమ కట్టడాలు కడితే... దానిపై చర్యలు ఉంటాయని తెలిసి కూడా దర్జాగా అక్రమార్కులు వాటిని కట్టుకుపోతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సరిగా దృష్టి పెడితే.. అక్రమ భవన నిర్మాణాలను కూల్చివేసే అధికారం ఉంటుంది. అయితే ఈ విషయాన్ని కూడా కొందరు అధికార సిబ్బంది, దళారీలు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలున్న ప్రాంతాలివే: రాజమహేంద్రవరంలో ఇప్పుడు ఏ రోడ్డులో చూడినా.. నిబంధనలు పాటించని కట్టడాలే అధికం. ముఖ్యంగా రద్దీగా ఉండే.. దానవాయిపేట, గాంధీపురం, ప్రకాష్ నగర్, ఏవీ రోడ్డు, జేఆర్ రోడ్డు, తిలక్ రోడ్డు, పాటసోమలమ్మ రోడ్డు, టి నగర్, ఇన్నీసుపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, తిలక్ రోడ్డు, రంభ ఊర్వశి సెంటర్ వెనక గల మార్కెట్ ప్రాంతం, మెయిన్ బజార్ రోడ్డులో సందుల్లోనే బహుళ అంతస్తు భవనాలు భారీగా వెలిశాయి. ఇక ఏవీ అప్పారావు రోడ్డు, వెంకటేశ్వర నగర్, కోరుకొండ రోడ్, లాలితానగర్ తదితర ప్రాంతాల్లో కూడా ఈ అక్రమ కట్టడాలు అధికంగా ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ సుమారు ఏడాది కిందటే నిర్మించిన భవనాలు ఉన్నాయి. తాజాగా నిర్మించిన, నిర్మాణాలు కొనసాగుతున్న అపార్ట్మెంట్లు దాదాపు 50 కి పైనే కనిపిస్తున్నాయి. వెంకటేశ్వర నగర్ లో రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్గా ఐదంతస్తుల భవనంలో ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. అలాగే జేఆర్ రోడ్డులోని బారాముడి రెస్టారెంట్ పక్కనే నిబంధనలకు విరుద్ధంగా విరుద్ధంగా బహుళ అంతస్తు భవనం నిర్మించారు. అలాగే కలెక్టర్ బంగ్లా ఎదురుగాగల రోడ్డులోనూ, రాజ్యలక్ష్మి మహిళా కళాశాల రోడ్డులోనూ, ఆనందరీజెన్సీ వెనక అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఎక్కువ శాతం రాజకీయ నాయకులు సిఫారసు చేసిన భవనాలు కావడంతో.. చర్యలు తీసుకోలేని పరిస్థితులున్నాయి.. మరికొన్నైతే.. మామూళ్ళు దండుకుని అధికారుల అడ్డగోలు ఆమోదంతోనే కొనసాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అధికారులు మారినా.. ఇదే తీరు నగరంలో కొనసాగుతోంది. ఆక్రమ నిర్మాణాలపై ఉదాసీనత స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు దాదాపు నాలుగైదు ఏళ్లుగా వచ్చిన కలెక్టర్లు, మారిన కమిషనర్లు ఈ అక్రమ కట్టడాలపై కనీస చర్యలు తీసుకోలేకపోయారు. మరి, రానున్న పుష్కరాలను దృష్టించైనా.. నగరాన్ని ఇరుకుమయం చేస్తున్న ఈ నిర్మాణాలపై, ప్రస్తుత అధికారులైనా చర్యలకు దిగుతారని అంతా భావిస్తున్నారు. నగరపాలక సంస్థ నూతన కమీషనర్ రాహుల్ మీనా ఐనా.. ఈ బహుళ అక్రమ దందాకు అడ్డు కట్ట వేస్తారా.. లేదా అని నగర ప్రజలుచర్చించుకుంటున్నారు.

# ట్రంప్‌కు లొంగిపోయిన మోడీ



### పదేపదే ప్రశంసలే ఇందుకు నిదర్శనం

### ఎక్స్ వేదికగా విపక్షనేత రాహుల్ విమర్శలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ప్రధాని మోడీ లొంగిపోయారని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా, మోడీ నుంచి సమాధానం లేదన్నారు. ఈ బెదిరింపు చర్యల్లో భాగంగానే అమెరికా భారత్‌పై పెద్దఎత్తున సుంకాల్ని విధించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి ఆయిల్‌ని కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తనకు హామీ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్‌కి మోడీ భయపడిపోయారని రాహుల్ ఆరోపించారు. దీనికి తాజా సంఘటనలే తార్కాణమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయదని

ట్రంప్ నిర్ణయానికి మోడీ అనుమతించడం,. భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు ట్రంప్ చేస్తున్నప్పటికీ.. ప్రధాని మోడీ ట్రంప్‌కి పదేపదే అభినందనలు తెలుపుతూ సందేశాలు పంపడం ఏమిటన్నారు. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం, ఈజిప్ట షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాకపోవడం,ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపానని చెబుతున్నప్పటికీ మోడీ నోరెత్తకపోవడం... ఆ వ్యాఖ్యల్ని విభేదించకపోవడం వంటి చర్యల్ని చూస్తే.. మోడీ ట్రంప్‌కి భయపడిపోయారని తెలుస్తోందని రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రధానిని విమర్శించారు.

# అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మైలపల్లి బన్ని

### అభినందించిన రణస్థలం ఎన్టీఆర్ ఫాన్స్, అల్లుఅర్జున్ ఫాన్స్

**రణస్థలం, జయజయహే**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం, కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి బన్ని నియమితులయ్యారు. నిర్మాత బన్నీ వాసు ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయగా, మైలపల్లి బన్ని హైదరాబాద్ లోని పార్క్ హయత్ హోటల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో భాగముగా రణస్థలం ఎన్టీఆర్ ఫాన్స్ఆధ్వర్యంలో గురువారం, అల్లుఅర్జున్ ఫాన్స్ అభిమాన సంఘం, మండల కేంద్రంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైలపల్లి బన్ని మాట్లాడుతూ నాకు ఈ



సదావకాశాన్నిచ్చిన అల్లు అర్జున్ కు, ప్రత్యేక కృతజ్ఞతలని, రణస్థలంలో అసోసియేషన్ పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, రాష్ట్రంలో అల్లు అర్జున్ ఫాన్స్ తోపాటుగా, అందరికీ అందగానిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ టీం తారక్ ట్రస్ట్ స్టేట్ కో.ఆర్డినేటర్ వాసుపల్లి నరసింహా మూర్తి, వెంకట రమణ, దినేష్, తేజ, హరీష్, కార్తీక్, అల్లు అర్జున్ ఫాన్స్, గణి, కుమార్, జనసేన



నాయకులు మైలపల్లి రాంప్రసాద్, వెంకీ, పెద్ద కొవ్వాడ మెగా యూత్ కమిటీ సభ్యులు తదితరులు అభినందనలు తెలియజేసారు.



# సీహెచ్ సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్

### జిల్లా అధికారిని పర్యటన గోప్యం ఎందుకో?

**ముంచంగిపుట్టు, జయజయహే**

మండల కేంద్రంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్సీ)ని డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి గురువారం తనిఖీ చేశారు. ఆమె సీహెచ్సీకి వచ్చిన విషయాన్ని స్థానిక పాత్రికేయులకు కనీస సమాచారం ఇవ్వలేదు. ఆమె సందర్శన వైద్య విధాన్ పరిషత్ అధికారులు రహస్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిస్తుంది. ఆమె సందర్శనకు సంబంధించి అందిన వివరాలు ఇలా ఉన్నాయి. వార్డులలోకి వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే ఆదినారాయణ అనే గిరిజనుడు సకాలంలో వైద్య సేవలు అందక సీహెచ్సీలో బుధవారం మృతి చెందాడనే విషయం వివిధ పత్రికల్లో రావడంతో దానిపై ఆమె ఆరా తీసినట్లు తెలిసింది. సీహెచ్సీలో ఆదినారాయణ మృతిపై వైద్యులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశంలో వివరాలు సేకరించి, కొంత మం ది వైద్య సిబ్బంది నుంచి వారి అభిప్రాయాలను లెటర్ రూపంలో తీసుకున్నారు. అలాగే ప్రస్తుతం అంబులెన్స్ పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని నీలవేణి సూచించారు. జిల్లా స్థాయి అధికారిణి సీహెచ్సీ తనిఖీ రహస్యంగా ఉంచడం వలు విమర్శలకు తావిస్తుంది.

# లిక్కర్ సిండికేట్‌కు నాయకత్వం వహిస్తున్న టిడిపి నాయకుల బండారం బట్టబయలు

### రాజమండ్రి లో సంచలనం సృష్టించిన ఆడియో సంభాషణ

### మాజీ ఎంపీ భరత్

**రాజమహేంద్రవరం, జయజయహే:**



రాష్ట్ర ప్రజల ఆరోగ్యాలను పణంగా పెట్టి నకిలీ మద్యం అమ్మకాలకు, సిండికేట్లుగా వ్యవహరించి నకిలీ మద్యం దోపిడీకి పాల్పడుతున్న టిడిపి నాయకుల బండారం బట్టబయలు అయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఓ ఆడియో ను కూడా మీడియా కు రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిక్కర్ సిండికేట్ గా రాజమండ్రి అర్బన్, రూరల్ ప్రాంతాలలో చక్రం తిప్పుతున్న రాజమండ్రి తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం అధ్యక్షులు మజ్జి రాంబాబు లిక్కర్ సిండికేట్ వ్యవహారాలు నడుపుతున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాజమండ్రి పరిధిలో ఉన్న 39 షాపుల యజమానులు ఐక్యతతో రేట్లు పెంచి అమ్మకాల సాగించాలని నిర్ణయించారని తెలిపారు. లిక్కర్ సిండికేట్ లు అమ్ముతున్న అధిక ధరలు కు అడ్డు చెప్పకుండా ఎక్సైజ్ అధికారులకు షాపులలో అమ్మకాలను బట్టి ఎక్సైజ్ అధికారులకు లంచాలు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. సిండికేట్లలోని షాపుల పై ఎక్సైజ్ అధికారులు కేసులు పెడితే ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఒక షాపుకు ఒక్క కేసు మాత్రమే నమోదు చేయాలని సిండికేట్లు నిర్ణయించారని ఆరోపించారు. 39 షాపుల యజమానుల నుంచి 100 రూపాయల బాండ్ పేపర్ పై సంతకాలు తీసుకొవడం తోపాటు, లక్ష రూపాయలు విలువ గల చెక్కులను తీసుకోవాలని మద్యం సిండికేట్లు నిర్ణయానికి వచ్చారని తెలిపారు. మద్యం షాపుల నిర్వహణలో 39 షాపుల సిండికేట్ యజమానులు ఐక్యతతో ముందుకు సాగాలని టిడిపి నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు సూచించడం దారుణమని అన్నారు. బహిరంగంగా లిక్కర్ సిండికేట్ వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్న మజ్జి రాంబాబు పై నకిలీ మద్యం అమ్మకాలు ప్రోత్సహిస్తు, ఎమ్మార్పీరేట్లు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తూ , లంచాలు ఇచ్చి సంబంధిత అధికారులను ప్రలోభం పెట్టినందుకు, బెల్ట్ షాపులు ద్వారా విచ్చలవిడిగా దోపిడీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్న టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై సెక్షన్ 37(a), 39(1)(2) ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ యాక్ట్ అండ్ బిఎన్ఎస్ సెక్షన్ 274, 276, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు నకిలీ మద్యంపై ఉక్కు పాదం మోపి నిందితులను జైలుకు తరలించాలని డిమాండ్ చేశారు.



# లివర్ పేషెంట్ కి వాసుపల్లి రూ.5000 ఆర్థిక సాయం

### పార్టీ బలోపేతం, మరో పక్క ప్రజాసేవలో దూసుకుపోతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్ కుమార్

**విశాఖపట్నం, జయజయహే**

దక్షిణ నియోజకవర్గంలో పేదల పాలిట ఆపద్బాంధవుడు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ లివర్ పేషెంట్ కి రూ. 5000 ఆర్థిక సాయం చేశారు. 31 వ వార్డు గౌడ కులానికి చెందిన కనకల వీధి కాగిత రామకృష్ణ లివర్ ఊపిరితిత్తుల సమస్యతో గత కొద్ది కాలంగా మంచాన పడ్డారు. ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ ద్వారా విషయం తెలుసుకొని వాసుపల్లి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సొంత నిధులతో రూ. 5000లు అందించడంతోపాటు ఆ కుటుంబానికి తాను అండగా ఉన్నానంటూ ధైర్యం నింపారు . నియోజకవర్గంలో పేద కుటుంబాలకు భరోసానిస్తూ మెడికల్ సాయం, ఆర్థిక సహాయం, విద్యా దానం చేయడంలో వాసుపల్లి గణేష్ కుమార్ ఒక బ్రాండ్ గా నిలిచారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఒకేలా సేవలందిస్తూ తనదైన శైలిలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వినూత్న రీతిలో సమాధానమిస్తూ ఒక పక్క పార్టీ బలోపేతం మరొ పక్క ప్రజా సేవలో వాసుపల్లి గణేష్ కుమార్ దూసుకు వెళ్తున్నారు. కార్యక్రమంలో పెంటకోట నాగ రాజు (మాజీ వార్డు అధ్యక్షుడు),జిల్లా స్టూడెంట్ విభాగం జనరల్ సెక్రటరీ మోహన్ ,కోడూరు కనకరాజు, పెంటకోట బాబురావు, నాయుడు, గంటా శ్రీను, రాము మాస్టర్, దినేష్, మహేష్, కనుకులు, కొండ రామ, దుర్గ, సంతోష్ (సెంట్రల్ పార్క్), అరుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.



## రష్యా నుంచి ఇక భారత్

# చమురు కొనదు

### మోడీ నాతో చెప్పి.. హామీ కూడా ఇచ్చారు

### మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈమేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి రష్యాను ఒంటరిని చేయడంలో ఇదొక కీలక అడుగని అభివర్ణించారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. రష్యా నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై ప్రధాని మోదీ వద్ద తాను ఆందోళన వ్యక్తం చేశానని ట్రంప్ చెప్పారు. మాస్కో నుంచి భారత్ చమురు కొనడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు పుతిన్ ఆ నిధులు ఉపయోగిస్తున్నారని అమెరికా భావిస్తున్నదని తెలిపారు. ఈ కొనుగోళ్లపై తాను సంతోషంగా లేనని చెప్పాను. ఈ సందర్భంగా ఇక నుంచి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ప్రధాని మోదీ ఈరోజు తనకు హామీ ఇచ్చారని. ఇదొక కీలక ముందడుగు అని చెప్పారు. చైనా కూడా రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని, ఇక అదే మిగిలి ఉందని తెలిపారు. భారత్, చైనా.. అమెరికాతో కలిసి వస్తే పుతిన్ చేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనకు స్నేహితుడని, తమ మధ్య గొప్ప అనుబంధం ఉందని చెప్పొకొచ్చారు. నేను చాలా ఏండ్లుగా భారత్‌ను గమనిస్తున్నానని, అది అద్భుతమైన దేశమని చెప్పారు. గతంలో ప్రతి ఏడాది కొత్త నాయకుడు వచ్చేవారు. కొందరు కొన్ని నెలలకే మారిపోయేవారన్నారు. కానీ ఇప్పుడు తన మిత్రుడు చాలా కాలంగా అక్కడ అధికారంలో కొనసాగుతున్నారని వెల్లడించారు. మోదీ నాయకత్వంలో రాజకీయంగా స్థిరత్వం సాధించిందని వ్యాఖ్యానించారు. ఇదిలాఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

# తాయిలాలకు లొంగితే అంతే సంగతులు!

**ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు.**




బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లంయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహార్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్ధకం గా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! అయితే అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయి. తాజాగా 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ క్రమంలో బీహార్ అభివృద్ధికి ఏం చేస్తారన్న దానిపై రాజకీయ పార్టీల్లో స్పష్టత లేదు. కేవలం ఓట్లు కొల్లగొట్టి అధికారం దక్కించుకోవడం అందరిపనిగా మారింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేతల కుయుక్తులను గమనించాలి. తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. తాయిలాలు ఆశపడితే మరో ఐదేళ్లు లొంగిపోవాల్సి ఉంటుందని గుర్తించాలి.

# సంగీత కళానిధి శ్రీ నేదునూరి కృష్ణమూర్తి

(సి.హెచ్.ప్రతాప్)



కర్ణాటక సంగీత ప్రపంచంలో నేదునూరి కృష్ణమూర్తి గారి పేరు ఒక సుస్పష్ట గుర్తుగా నిలిచింది. 1927 అక్టోబర్ 10న ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తపల్లి గ్రామంలో జన్మించిన ఆయన, చిన్న వయసులోనే సంగీతం పట్ల ఆసక్తి చూపించారు. ఆయన తల్లి విజయలక్ష్మి గారు భక్తి సంగీతంలో నైపుణ్యం కలిగినవారుబీ చిన్న వయసులోనే నేదునూరికి సంగీత ప్రాథమిక శిక్షణ ఇచ్చి, సంగీత పట్ల ఆరాధన భావాన్ని పెంపొందించారు.

తరువాత, ఆయన విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో ప్రసిద్ధ గురువైన శ్రీపాద పినకపాణి గారి వద్ద శిక్షణ పొందారు. నేదునూరి గారి గురువుతో సంబంధం కేవలం శిక్షణకేగా కాకుండా ఆత్మీయమైనది. పినకపాణి గారి దృఢమైన అంకితభావం, సంగీతపట్ల క్రమశిక్షణ, శ్రద్ధను నేదునూరి గారు చిన్నప్పటి నుంచే గాఢంగా గ్రహించారు. గురువు-శిష్య సంబంధం ద్వారా ఆయనలో సంగీతంపై నిబద్ధత, సౌందర్యానుభూతి, భావ వ్యక్తీకరణలో లోతు పెరిగింది. గురువు ఇచ్చిన శ్రద్ధ, దృఢమైన పద్ధతులు ఆయన జీవితం మొత్తం కర్నాటక సంగీతాన్ని ప్రతిభావంతంగా ఆచరణలో ఉంచడంలో కీలకపాత్ర పోషించాయి.

నేదునూరి గారి సంగీత శైలి శ్రావ్యమైనది, శాస్త్రీయతతో నిండినది. ఆయన గాత్రంలో రాగాల లోతైన అవగాహన, తానమ్, నిరవళ మరియు స్వర కల్పనలోని నైపుణ్యం ప్రతి హృదయాన్ని మంత్రముగ్ధం చేసేలా ఆకట్టుకుంది. భావోద్వేగాన్ని స్వరాల ద్వారా వ్యక్తపరచడంలో ఆయన ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది.

అనామక అన్నమాచార్య కీర్తనల ప్రాచుర్యం కోసం నేదునూరి గారు గొప్ప కృషి చేశారు. ఆయన అనేక కీర్తనలను స్వరరచన చేసి, ప్రదర్శనల ద్వారా వాటిని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చి, భక్తి సంగీతాన్ని మరింతగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. ఈ కృషి వల్ల అన్నమాచార్య కీర్తనల సంగీత విలువ, ప్రసిద్ధి కర్ణాటక సంగీతలో మరింత స్థిరమైంది.

నేదునూరి గారు ప్రధానంగా మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో 52 ఏళ్లుగా పనిచేశారు. అక్కడ ఆయన ప్రదర్శనలు ఇచ్చి, సంగీత అధ్యాపకత, శిష్యపాలన ద్వారా కర్ణాటక సంగీతంపై అపూర్వ ప్రభావాన్ని చూపించారు. ఆయన వేదికపైన మాత్రమే కాక, తరగతులలో, శిష్యులకు శిక్షణ ద్వారా కూడా సంగీతాన్ని లోతుగా బోధించారు.

నేదునూరి గారి శిష్యులు కూడా సంగీతంలో వెలిగిన తారలు. డొమాడ చిత్తబాయి, గరిమెల్ల బాలకృష్ణ ప్రసాద్, శోభారాజు, మల్లాది బ్రదర్స్, శారదా సుబ్రహ్మణ్యం, సేషులత విశ్వనాథ్, టీ. శ్రీనిధి, పద్మవతి త్యాగరాజు వంటి శిష్యులు ఆయన కృషి ఫలితంగా కర్ణాటక సంగీతంలో ప్రసిద్ధి సాధించారు. ఆయన శిష్యులకు సంగీతంలో క్రమశిక్షణ, నిబద్ధతను బోధించడం, సంగీతంపై అంకితభావాన్ని సృష్టించడం ఆయన ప్రత్యేకత.

అనేక ప్రతిష్టాత్మక అవార్డులు ఆయన ప్రతిభకు సాక్ష్యం. 1991లో మద్రాస్ సంగీత అకాడమీ నుండి 'సంగీత కళానిధి' అవార్డు, 1986లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, 1976లో శ్రీ కృష్ణ గణ సభ నుండి 'సంగీత చూడామణి', 2006లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిభ రాజీవ్ పురస్కారం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అస్థాన విద్వాన్, దక్షిణ భారతీయ సాంస్కృతిక సంఘం నుంచి సంగీత చక్రవర్తి వంటి అనేక అవార్డులు ఆయనకు లభించాయి.

ప్రతీ ప్రదర్శనలో ఆయన భావోద్వేగం, స్వరాల సరళత, రాగాల లోతైన అవగాహన స్పష్టంగా ఉండేది. అనేక రాగాల సృజనాత్మకత, తానమ్ మరియు కల్పన స్వరాలతో ఆయన సంగీతం ప్రత్యేకతతో నిలిచింది.

నేదునూరి కృష్ణమూర్తి గారి సంగీత జీవితం కేవలం వేదికల్లో ప్రదర్శనలు ఇవ్వడమే కాదు, భక్తి సంగీతాన్ని ప్రజల మధ్య విస్తరించడంలో కూడా అంకితభావంతో నిండింది. ఆయన ప్రత్యేకంగా అన్నమాచార్య కీర్తనలను పునరుజ్జీవింపజేయడం, వాటిని కర్నాటక సంగీత ప్రదర్శనల్లో చేర్చడం ద్వారా ఈ పురాతన కీర్తనలు సమకాలీన సంగీత ప్రియులకు చేరేలా చేశారు. స్వరరచనలు, సంగీత సమన్వయం, అభ్యాసపద్ధతుల ద్వారా ఆయన అన్నమాచార్య కీర్తనలను శ్రావ్యంగా, హృదయస్పర్శిగా ప్రజల ముందుకు తీసుకు వచ్చారు. ఫలితంగా, ఈ కీర్తనల ప్రాచుర్యం మరియు కర్నాటక సంగీతలో భక్తి సంగీత స్థానం మరింత దృఢమయింది. నేదునూరి గారి ఈ ప్రయత్నం సంగీత పరిశ్రమకు, భక్తి సంప్రదాయానికి మరియు జనసామాన్యులకు విలువైన వారసత్వంగా నిలిచిపోయింది.

నేదునూరి కృష్ణమూర్తి గారు 2014 డిసెంబర్ 8న విశాఖపట్నంలో 87 ఏళ్ల వయస్సులో మరణించారు. ఆయన మరణం కర్ణాటక సంగీత ప్రపంచానికి అపూరణీయ నష్టాన్ని కలిగించింది. కానీ ఆయన సంగీతం, శిష్యులపై చూపిన అంకితభావం, భక్తిసంగీతం పట్ల చేసిన కృషి శాశ్వతంగా మన హృదయాల్లో నిలిచిపోతుంది.

నేదునూరి కృష్ణమూర్తి గారి సంగీతం ఒక శాస్త్రీయ సౌందర్యంతో కూడిన భావోద్వేగ అనుభూతి. ప్రతి స్వరం, ప్రతి రాగం, ప్రతి తానమ్ కర్ణాటక సంగీతంలో ఒక మణిముత్యం. ఆయన జీవితాన్ని సంగీతానికి అర్పించడం ద్వారా ఆయన కర్ణాటక సంగీతంలో ఒక శాశ్వత గుర్తుగా నిలిచారు.



# పాక్‌తో చెలిమి కోసం ట్రంప్ ఆరాటం

### భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు

### అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ వ్యాఖ్యలు

పాక్‌తో చెలిమి కోసమే ట్రంప్ ఆరాటం అని, అందుకు భారత్‌తో చెలిమిని వదులుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నా రన్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులు కుంటున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోందని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

# బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు డిమాండ్

అనకాపల్లి , జయజయహే

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ పార్కు పార్కు వద్దు మాకు గంగమ్మ తల్లి ముద్దు అంటూ గత నెల రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు ఈ పోరాటాన్ని అణిచివేయాలన కుట్రపూరితంగా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని దీనిని నిరసిస్తూ గురువారం అనకాపల్లి నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరావు సిపిఐ జిల్లా కార్యదర్శి రామనాయుడు మాట్లాడుతూ రాజయ్యపేటలో నెలల తరబడి సెక్షన్ 30 అమలు చేస్తూ పోలీసులు పికెట్లు పెట్టి ప్రజానీకాని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిపిఎం ఇతర పార్టీ నాయకులను గుహనిర్బందల నిర్బంధిస్తున్నారని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆధార్ కార్డు చూసివారు ఆ గ్రామస్తులయితేనే అనుమతిస్తున్నారని గ్రామం చుట్టూ పోలీసు పహారా పెట్టారని బయటివారిని ఎవరిని గ్రామంలోకి అనుమతించడం లేదని వార ఆరోపించారు. గ్రామం చుట్టూ పోలీస్ పహారా పెట్టి ప్రజలను నిర్బంధం చేసి ఉక్కు పాదం మోపి ప్రజల జీవించే హక్కును నిరసన చేసే హక్కును ప్రజాస్వామ్యాన్ని ఈ ప్రభుత్వం ఖూనీ చేయడానికి చూస్తున్నదని ప్రజాస్వామ్య వాదులంతా ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించే మత్స్యకారుల పోరాటానికి మద్దతు తెలియజేయాలని ప్రజలకు అన్ని పార్టీలకు వారు పిలుపునిచ్చారు రాజయ్యపేట వద్ద ఒక వెయ్యి 270 ఎకరాలు అత్యంత కాలుష్య కారక బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు 2025 ఆగస్టు 6 ప్రజా అభిప్రాయ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది ఈ ప్రజా శాఖల పాల్గొనడానికి వెళ్లిన నాయకులను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు ఆనాడు గృహనిర్బంధాలు చేశారు అయినప్పటికీ మత్స్యకారులు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు హాని చేసే బల్క్ డ్రగ్స్ పార్కు వద్దని తమ అభిప్రాయం తెలియజేశారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించని రాష్ట్ర ప్రభుత్వం ఈ పార్కు అవసరమైన రోడ్లు డ్రైనేజ్మెంట్ నిర్మాణాల పనులు



సరవేగంగా చేస్తున్నదని దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు నిరసనకు దిగారని పోలీసులు ఈ నిరసన కనుమతి ఇవ్వకపోయినా మండుటెండలో వర్షం సైతం లెక్కచేయక శాంతియుత నిరసన దీక్షలు చేస్తున్నారని మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన హెూం మంత్రి సెప్టెంబర్ 29న గ్రామంలోకి దీక్షా శిబిరానికి వచ్చి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో ఆరోజు మంత్రి ని అడ్డుకున్నారని దీంతో హెూం మంత్రి నిర్మాణ పనులు నిలుపుదల చేస్తామని ప్రకటించడం తప్ప దీన్ని రద్దు చేస్తాము అని ఎలాంటి హామీ ఇవ్వలేదని గత ఎన్నికల ముందు రాజీవ్ పేట వచ్చిన అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని బల్క్ డ్రగ్స్ పార్క్ ఎట్టి పరిస్థితులలో అనుమతించనని ఆనాడు హామీ ఇచ్చారు హెట్రో డ్రగ్స్ పైప్ లైన్ సముద్రంలోకి వేయడం వల్ల జలచరాలు మత్స్య సంపద చనిపోతున్నాయని దీనితో మత్స్య సంపద తగ్గడంతో మత్స్యకారులు ఆ గ్రామాలు వదిలి కుటుంబాలు వలస బాట పడుతున్నారని ఆ ప్రాంత ప్రజలకు చర్మవ్యాధులు ఊపిరితిత్తులు జబ్బులు క్యాన్సర్ కిడ్నీ వంటి వ్యాధులు ప్రభలుతున్నాయని ప్రజలందరూ ముక్తకంఠంతో చెప్పడం జరిగింది. గ్రామ సభలో పెట్టకుండా ప్రజల ఆమోదం లేకుండా బల్క్ డ్రగ్స్ కంపెనీ అనుమతులు ఇవ్వబోమని వాగ్దానం చేశారు ఏమైనా డబ్బులు ఇచ్చి కొనవచ్చు కానీ ప్రాణాలు కొనలేమని ఆనాడు అనడం జరిగింది పోరాటాలతోనే రాజయ్య పేటను రక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు హెూం మంత్రి ని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఇప్పుడు కాలుష్య కుంపటి బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయడానికి ఆమె సుముఖత వ్యక్తం చేయడం మత్స్యకారులుకు ఇచ్చిన ఆనాడు హామీని తుంగలో తొక్కి మాట తప్పారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆగకుండా నిర్మాణ పనులు చేస్తున్నదని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిర్మాణ పనులు ఎలా చేస్తారని అడుగుతున్న మత్స్యకారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం ప్రజల జీవించే హక్కును కాలరాసే విధంగా ప్రభుత్వం ఫోన్ కూడా దుర్మార్గమని ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని ప్రజాభీష్టం మేరకు బల్క్ డ్రగ్స్ పార్కును ప్రతిపాదను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్ శంకరరావు, వివి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు దొరబాబు ,వైఎన్ భద్రం ,తాకాసి వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బట్ట చిన్ని యాదవ్, రైతు కూలీ సంఘం నాయకులు కే మోహన్ రావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాని బాబు, కాళ్ళ జయ బాబు ,అల్లు రాజు ,మహిళ నాయకురాలు పరమేశ్వరి, జి సుభాషిని తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, జయజయహే::

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యాధికారులు పరస్పర సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, వైద్య పరికరాల స్థితి, సిబ్బంది భర్తీ, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఆసుపత్రి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సదుపాయాలు, రోగుల కోసం వేచిచోట్ల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలన్నారు..“ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్య సేవలు అందించే క్రమంలో ప్రతి వైద్యుడు ప్రజల కోసం పనిచేస్తున్నా మనే భావనతో బాధ్యతగా విధులను నిర్వహించాలన్నారు. రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో మొత్తం 484 పోస్టులు మంజూరై, 326 పోస్టులు భర్తీ కాగా, 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఖాళీగా ఉన్న పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్ పోస్టులను నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ఇప్పటికే పూర్తయిన ఎంసిహెచ్, కంటి, మైక్రో బయాలజీ విభాగాల భవన విస్తరణలలో నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఇన్‌పేషెంట్ రోగులకు అందించిన చికిత్స వివరాలను ఎప్పటి కప్పుడు నిర్ణిత సమయంలో గా ఎన్టీఆర్ వైద్య సేవా పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. తద్వారా లభించే ప్రోత్సాహక నిధుల వల్ల ఆసుపత్రి అభివృద్ధి పనులకు వినియోగించవచ్చని ఆమె తెలియ చేశారు. మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ప్రతి విభాగం తమ సిబ్బంది వివరాలు, వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పన, అవసరమైన మందులు తదితర అంశాలపై నివేదికలు సమర్పిస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, ఇతర అనుబంధ కార్యకలాపాలు పై రాష్ట్ర ప్రభుత్వం ఐ.వి.ఆర్.ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న నేపథ్యంలో, అందిన సూచనల ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా బి. సౌభాగ్య లక్ష్మీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్..భాస్కర్ రెడ్డి, వివిధ వైద్య విభాగాల హెచ్ఓడీలు, వైద్యులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జీతాలివ్వండి మహాప్రభో

## ఆందోళన బాటలో ఏరియా హాస్పటల్ పారిశుధ్య కార్మికులు

## విధులు బహిష్కరణకు నిర్ణయం

జంగారెడ్డిగూడెం, జయజయహే

గత నాలుగు నెలల వేతనాలు విడుదల చేసేంతవరకు విధులు బహిష్కరిస్తామని జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు హెచ్చరించారు. తమకు న్యాయం చెయ్యాలని ఆందోళన చేపట్టారు. ఇక్కడి ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నాల్గవ రోజు గురువారం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నాచేసి విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు,మండల కార్యదర్శి కుంచె వసంతరావుమీడియా తో మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్ కు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదనిపేర్కొన్నారు. కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారికీ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ,ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు..చాలీచాలని వేతనాలతో కడు దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న పారిశుద్ధ కార్మికులకు , ప్రభుత్వానికి ఏజెన్సీల పేరిట దళారుల వ్యవస్థను కొనసాగించడం సహేతుకము కాదనితెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలనివారు. డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలపై కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయనే విధంగా పరిస్థితి ఉందని, ఇది సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు,వేముల రాజు,, మేరీ, ,దయామని, ప్రభావతి,సీత, కృష్ణవేణీ, జె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ రాకతో విశాఖకు మహర్దశ ...!

## టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమిలి, జయజయహే



డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ పాలనతో విశాఖపట్నం ముఖచిత్రం మారబోతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కు గ్రీన్ సిగ్నల్ వచ్చిన సందర్భంగా గంటా నూకరాజు మీడియా సమావేశంలో స్పందించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థత, ఐటి శాఖామంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా ఇది సాధ్యమయిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించేవిధంగా కూటమి సర్కార్ చేస్తున్న కృషి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. 2014-19 కాలంలో విదేశీ పెట్టుబడులతో రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో కియా మోటర్స్ ఏర్పాటు చేశారని అన్నారు. నేడు ప్రపంచ స్థాయి గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ను ఆంధ్రాకి రప్పించారని అన్నారు. అమెరికా వెలుపల గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖ వేదిక కానుందని అన్నారు. గతంలో మైక్రో సాఫ్ట్ హైదరాబాద్ రూపురేకలు మార్చినట్టే... నేడు గూగుల్ విశాఖ రూపురేఖలను మారుస్తుందని అన్నారు. దీని రాకతో జిల్లాకు అనేక అనుబంధ కంపెనీలు రానున్నాయని అన్నారు. గ్రేటర్ విశాఖ భారీ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అన్నారు. కొన్ని వేలమంది యువతకు, లక్షల సంఖ్యలో సాఫ్ట్ వేర్లకు విశాఖ జిల్లా అమ్మలా మారబోతుందని అన్నారు. కూటమి సర్కార్ పనిచేసి చూపిస్తుందని.. వైసిపీ కోడిగుడ్లు కథ చెబుతుందని వ్యాఖ్యానించారు. అదేవిదంగా మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణ కోసం వైసిపీ రాద్దాంతం చేస్తుందని అన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో నాణ్యత, పేద పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించడం వంటి నిర్ణయాలు కారణంగా పిపిపి పద్ధతులను కూటమి సర్కార్ అవలంభించిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్తుతుల కారణంగా పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్ షిప్ నిర్ణయమని అంతేకానీ ఎక్కడా ఆస్తులను అమ్మడం గాని, అప్పగించడం గానీ లేదనే విషయాన్ని వైసిపీ నాయకులు అర్థం చేసుకోవాలని అన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో అనవసరం రాద్దాంతం మానుకోవాలని, రాష్ట్రం అభివృద్ధి దశలో పరుగులు పెడుతుందని, యువతకు అధికసంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా వచ్చే అవకాశం ఉందని గంటా నూకరాజు తెలియజేసారు.



# జంగారెడ్డిగూడెం టౌన్‌లో మాస్టర్ ప్లాన్ అమలు

## రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

జంగారెడ్డిగూడెం, జయజయహే

రాబోయే ముప్పయ్ ఏళ్లలో జరగబోయే అభివృద్ధిని అంచనా వేస్తూ జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ ఆమోదముద్ర పడటం శుభపరిణామం అనిపట్టణతెలుగు దేశం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఇందుకు సంబంధించిన జీవోను ఇటీవల విడుదల చేశారని పేర్కొన్నారు. దీంతో మాస్టర్ ప్లాన్ పట్టణంలో అమలులోకి వచ్చిందని గురువారం మీడియాకు తెలిపారు. ఇప్పటి వరకు ఐఎల్ యూపీ మ్యాప్ ద్వారా ప్లాన్లు ఇచ్చేవారని ఇక నుంచి మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇంటి ప్లాన్లు,ఇతర ప్లాన్లను మున్సిపాలిటీలో ఆమోదించనున్నారని పేర్కొన్నారు. రాబోయే 30 ఏళ్లలో జరగబోయే అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని దీనిని రూపొందించారని, రహదారుల విస్తరణ, అభివృద్ధికి ఈ ప్లాన్ దోహదం పడనుందని వివరించారు.టౌన్ సమీపంలో ని ఓ.ఆర్.ఆర్ సుమారు 50 కిలోమీటర్ల సర్కిల్ పరిధిలో ఉన్న పల్లెలను అనుసందానం చేస్తూ వస్తుందని తెలిపారు. ఇదే కనుక జరిగితే పట్టణం లో ఉన్న భూముల రేట్లు అమాంతంగా పెరుగుతాయని,ఈ ఓ.ఆర్.ఆర్. కి కావలసిన భూములు అన్ని ప్రభుత్వ భూములనే వాడనున్నారని అన్నారు. మాస్టర్ ప్లాన్లో హానికారక పరిశ్రమలకు చోటు ఉండదని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ఆమోదంకోసం సహకరించిన పార్లమెంటు సభ్యుల పుట్టా మహేష్ కుమార్,చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ కి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగానే పట్టణం అభివృద్ధితో పాటు నిర్మాణాలు, లేఅవుట్లు అన్నీ మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగు తాయని, పట్టణవాసులు దీని ప్రకారం అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమం పట్టణ తెదేపా అధ్యక్షుడు కొండ్రె డ్డి కిషోర్ అధ్యక్షతన జరగ్గా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వర్రావు,క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామ చంద్ర రాజు, సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ,కరుటూరి రామాదేవి, తెలగారపు జ్యోతి, వల వల తాతాజీ, బొబ్బర రాజ్ పాల్, కుమార్,తూటికుంట దుర్గారావు,తూటికుంట రాము,అధికారప్రతినిధి గెడా సుబ్రహ్మణ్యం,తెలగారపు హనుమంతు, తోట సతీష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మల్లోజుల బాటలో ఆశన్న

## సిఎం విష్ణుదేవ్ ఎదుట లొంటుబాటు

జయజయహే

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన అగ్రనేత ఆశన్న ఛత్తీస్ గడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట లొంగిపోయాడు. ఆయన ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు.ఇప్పటికే మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఛత్తీస్ గడ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు జనజీవన స్రవంతిలో కలిశారు. ఆయనతో పాటు 130 లొంగిపోయారు. ఆశన్నతో పాటు 130 మంది మావోయిస్టులను(130 నీబిరఃస ఔజీలీజీబె) బీజాపూర్ పోలీసులు బస్సులో తరలించారు. ఈ క్రమంలో లొంగిపోయిన నక్సలైట్లందరూ తమ వద్ద ఉన్న ఆయుధాలను అప్పగించి సరెండర్ అయ్యారు. వరుస పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు ఆయుధాలు వదిలి పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. అగ్ర నేతలు కూడా సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం ముగించి.. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు.



# పీపీపీ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి



## పౌర సంస్థల విజ్ఞప్తి

**గుంటూరు, జయజయహే**

ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలోకి మార్చడానికి నిరసిస్తూ ఈనెల 19న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్ లో ఉదయం 10:30 గంటలకు జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయవలసిందిగా పౌర సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు, ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా॥ ఆలా వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, ఏఐయస్ఎఫ్ రాష్ట్ర నేత యశ్వంత్, దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొని రాష్ట్ర సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించి ప్రసంగించారు. డా॥ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అత్యున్నత ప్రమాణాలతో కొనసాగుతున్నయని, ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ధనార్జన కేంద్రాలుగా, అత్యల్ప విద్యా ప్రమాణాలతో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద వర్గాలకు వైద్య సేవలందిస్తుండగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య వ్యయం పెరిగి పేదలు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేట్ పరం చేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని లేనిపక్షంలో క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రజలను చైతన్యవంతులను చేసి ,ప్రభుత్వ మెడలు వంచుతామని పేర్కొన్నారు. బాగా వెనకబడిన ప్రాంతాలలో పేదలకు వైద్య విద్య, వైద్యం అందించే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ ఆసుపత్రులకు అందించడం ప్రజా ప్రయోజనాలను కాలరాసినట్లవుతుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఈనెల 19న ఆదివారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్ లో జరిగే రాష్ట్ర సదస్సును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా॥ పి.వి. రమేష్ ప్రారంభిస్తారని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డా॥ ఎన్. తులసీ రెడ్డి, మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు లతోపాటు 50 పౌరసంస్థలు, స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర నేతలు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పీ పీ పీ వ్యతిరేక పోరాట ఉద్యమ కమిటీని ఎన్నుకొని ఐక్య ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజలకు కనీస వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే దక్కుతుందని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదన్నారు. దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను యధాతధంగా కొనసాగించేంత వరకు ఉద్యమాన్ని సమిష్టిగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది షిఖా సురేష్, సామాజిక విశ్లేషకులు సాధు మాల్యాద్రి, నల్లమోతు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# రసాబాసగా దేవరాపల్లి సర్వసభ్య సమావేశం

**దేవరాపల్లి, జయజయహే**




మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. తల్లికి వందనం పథకం నిధుల కేటాయింపుపై పలువురు సర్పంచులు ప్రశ్నలు లేవనెత్తగా ఎంఈవో ఉషారాణి వివరణ ఇస్తున్న తరుణంలో అధికార పార్టీ నేతల జోక్యంతో వాగ్వాదం చెలరేగింది. సర్పంచ్ బూరె బాబురావు సహా ప్రజాప్రతినిధులు నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సమావేశం కొంతసేపు నిలిచిపోయింది. వైసీపీ, టీడీపీ ప్రజా ప్రతినిధుల మధ్య మాటల యుద్ధం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యల పురోగతిని సమీక్షించి, మండలంలోని వివిధ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు సభ్యులకు చదివి వినిపించారు. అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులు సూచనలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ అప్పలనాయుడు, ఎంఈఓ ఉషారాణి వారి వారి శాఖల సమీక్ష జరుగుతున్న సమయంలో ఏ. కొత్తపల్లి, బి. కింతాడ సర్పంచులు చింతల సత్య వెంకటరమణ, బూరె బాబురావు మాట్లాడుతూ కల్తీ మద్యంతో పాటు ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుపుతున్న సంబంధిత అధికారులు కనీసం చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదేవిధంగా తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు ఇస్తామన్న ప్రభుత్వం కొందరికి 13 వేలు, మరికొందరికి 7 వేలు, 6 వేలు చొప్పున తల్లులు ఖాతాలో జమ అయ్యాయని తల్లికి వందనములు మినహాయించిన సొమ్మును పాఠశాలల అభివృద్ధికి ఎందుకు ఖర్చు చేయలేదని అడిగారు. దీనిపై సమగ్రంగా సభలో తెలియజేయాలని కోరారు. దీంతో ఎంపీడీవో ఆహ్వానం మేరకు సభకు హాజరైన టీడీపీకి చెందిన రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, ఎం. అలమండ, కలిగొట్ల పిఎసిఎస్ అధ్యక్షులు గొర్లె గోవింద, దొగ్గ దేముడు నాయుడు కలుగజేసుకొని పైన చర్చకి వచ్చిన అంశాలను ప్రస్తావించే ప్రయత్నం చేశారు. వైసిపి సర్పంచులు బాబురావు, వెంకటరమణ, గూడుపు రాము అడ్డుకొని మీకు సంబంధం లేని విషయాలని, సర్వసభ్య సమావేశంలోకి ఎవరి ఆహ్వానం మేరకు వచ్చారని అడిగారు. దీంతో ఇరు పార్టీల ప్రజా ప్రతినిధుల మధ్య వాగ్వాదం నెలకొని సభ గందరగోళంగా మారింది. దీనిపై ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు స్పందిస్తూ నిబంధనలు ప్రకారం తానే ఆహ్వానించానని చెప్పారు. దీంతో శాంతించిన సభ్యులు సభ సజావుగా సాగడానికి సహకరించారు. అనంతరం రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పాత్రు నాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించి, వాటిని పరిష్కరించే పరిస్థితిని వివరించారు. జడ్పిటిసి కర్రి సత్యం సమావేశం అంతా తానై నడిపించారు. సభను నడిపించాల్సిన ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, ఎంపీడీవో సువర్ణ రాజు మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలం నాయుడు, ఊర్రుకుల గంగాభవాని, తహసీల్దార్ పి. లక్ష్మీదేవి, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, పరిపాలన అధికారి డి. వి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సి.పి.ఆర్. గురించి అవగాహన చాలా ముఖ్యం





## దిడాక్టర్ డివిజి శంకరరావు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం

**విజయనగరం, జయజయహే**

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ మరియు అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సి.పి.ఆర్ పై ప్రజల్లో అవగాహన కై.. వారోత్సవాలు చేపట్టిన సందర్భంగా గురువారం ఉదయం శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) సంయుక్త ఆధ్వర్యంలో "సి.పి.ఆర్." పై అవగాహనా కార్యక్రమాన్ని 42వ డివిజన్ పరిధిలో.. అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ వైద్యులు,ప్రముఖ సాహితీవేత్త, ప్రొఫెసర్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు వాకర్స్ సభ్యులందరికి సి.పి.ఆర్. ఉపయోగాన్ని,దాని అవసరాన్ని బట్టి మనిషిని ఎలా బ్రతికించవచ్చో వివరంగా స్వయంగా చేసి చూపించి,వాకర్స్ అందరికి తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ డి.వి.జి. శంకరరావు మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వెంటనే రోగికి చికిత్స అందించడం తప్పనిసరి, కాబట్టి సిపిఆర్ కోసం అవగాహన మరియు తగిన శిక్షణ చాలా ముఖ్యమని, నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి శిక్షణ యొక్క సౌలభ్యాన్ని ప్రదర్శిస్తూ మరియు దాని ప్రాముఖ్యతను చెప్పారు. "మనం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరియు సమతుల్య ఆహారం మరియు వ్యాయామంతో సహా ఆరోగ్యం పట్ల సమగ్ర విధానాన్ని అవలంబించడం చాలా ముఖ్యమని, అయితే, గుండెపోటుతో బాధపడుతున్న వ్యక్తికి.. సి. పి. ఆర్. టెక్నిక్‌లో శిక్షణ పొందినట్లయితే, అది మన ప్రాణాలను కాపాడటానికి వీలు కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ,పెనుమత్స అప్పలరాజు, కోట్ల ఈశ్వరరావు, ఇందుకూరి అప్పలరాజు,త్యాడ ప్రసాద్ పట్నాయక్,టి. రమణ, శ్రీనివాస్ తదితర పెద్దలు పాల్గున్నారు.




# రోడ్డుపై గోడ కట్టిన ఇంటి యజమాని

### - ఇబ్బంది పడుతున్న ప్రజలు

### ఇంటి ముందు రోడ్డును ఆక్రమించే ప్రయత్నం

**విశాఖపట్నం, జయజయహే**

వాహన రాకపోకలతో నిత్యం రద్దీగా ఉన్న రోడ్డు, జి వి ఏం సి పరిధి 14 వార్డు బాలయ్య శాస్త్రి లేఔట్, సీతమ్మధార స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాత ఆఫీసు పక్కనే ఉన్న రోడ్డును అక్కడే నివాసం ఉంటున్న యజమాని స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మించాడు వాహదారులకు కిమ్స్ హాస్పిటల్ నుండి, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ కు , పోర్ట్ స్టేడియం కు మరియు ప్రభుత్వ పాఠశాలలకు, కరెంట్ ఆఫీసు, ఎమ్మెల్యే ఆఫీస్ కు వెళ్లే షార్ట్ కట్ మార్గం కావడంతో వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో వెళ్లే పాదచారులు , ద్విచక్ర వాహనదారులు గోడను చూసి ఆశ్చర్య పోతున్నారు. గతంలో ఇంటి యజమాని రోడ్డు పక్కన కాలువ పై మెట్లు కూడా కట్టేసుకున్నాడు. జీవీఎంసీ అధికారులు చూసి చూడనట్లు నిర్లక్ష్యం చేశారని స్థానికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును ఆక్రమించి కట్టిన గోడను తక్షణం తొలగించి, ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఖరీఫ్ ఈ పంట నమోదు పూర్తి చేయాలి

**అనకాపల్లి, జయజయహే**

ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి పంటకు ఇ పంట వివరాలు నమోదు ప్రక్రియ అక్టోబర్ 25 నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమా వ్యాసం మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ ,నీటిపారు, మండల అధికారులు ,సివిల్ సప్లై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సమావేశంలో ఇ పంట నమోదు, ధాన్యం సేకరణ, పి జి ఆర్ ఎస్ రీ సర్వే, ఐ వి ఆర్ ఎస్, నీటి తీరువా, ఓ మ్యాపింగ్ తదితర అంశాలపై ఆమె అధికారులతో చర్చించారు. అక్టోబర్ 25 నాటికి ఖరీఫ్ వరి పంటకు సంబంధించిన ఇ పంట నమోదు నూరు శాతం పూర్తి చేయాలని ధాన్యం సేకరణకు జిల్లాలో 63 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు తెలియజేశారు జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అవసరమైన ఎనిమిది లక్షల 50 వేలు గోని సంచులు అవసరమవుతాయని అందులో నాలుగు లక్షల గోనెసంచులు బియ్యం మిల్లులు యాజమాన్యాల సరఫరా చేయనున్నారని ధాన్యం తీసుకువచ్చే రైతులు రవాణా గోన సంచులు సమకూర్చుకుంటే సాగర ఖర్చులు నేరుగా వారికి చెల్లించడం జరుగుతుందని ధాన్యం సేకరణకు సంబంధించి మండల గ్రామస్థాయి కమిటీలు నియామకం చేయాలని ఆమె అన్నారు. తేమ శాతం మిషన్లు, సేకరణ కేంద్రాలు మిల్లులో ఒకే కంపెనీ వినియోగించాలని, మిల్లుల వద్ద లోడింగ్ గంటలోకి జరిగేలా ఏర్పాట్లు చేయాలని ప్రక్రియ మొత్తం డిజిటల్ రికార్డ్ అవుతుందని గత సంవత్సరం అందించిన టార్పాలిన్లు అందుబాటులో గల వివరాలు అందజేయాలని రెవెన్యూ శాఖ సంబంధించిన సేవలు నిర్దేశించిన గడువు లోపల అందించాలని ప్రతి ఒక్కరికి ఇల్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవసరమైన ఇంటి స్థలాలను ప్రస్తుతం గల లేఔట్ లో ఖాళీల్లో భర్తీ చేయాలని అదనంగా భూమి అవసరం అయితే అందుబాటులో గల నివాసానికి అనుకూలమైన ప్రభుత్వ భూములు గుర్తించి సహకరించాలని అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న వారికి రెగ్యులర్ జషన్ చేయుటకు సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపించాలని ఆమె తెలిపారు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను డివిజన్ మండల, మండలస్థాయిలో సీసీ ఎల్ఏ నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం రిజిస్టర్ చేయాలని చీరస్కరించి ఆర్జీలకు అందుగల కారణాన్ని ఆర్జీదారునికి అందజేయాలని అలాగే ప్రభుత్వ భూములు సర్వే చేయాలని ఎక్కడైనా ఆక్రమణలు గుర్తించినట్లయితే ఆక్రమణదారులకు నోటీసులు అందజేయాలని నీటి తీరువ వసూలు పెంచాలని నిర్దేశించిన మొత్తాలను సమయానికి వసూలు చేయాలని వార్తా పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై తీసుకున్న చర్యలపై నివేదికలు అందించాల్సిందిగా అధికారులకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా క్రయ విక్రయాలు పెరుగుతాయని, కావున తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలని భద్రత ప్రమాణాలు తనిఖీ చేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు ఇస్తూ భద్రతా లోపాలు గుర్తిస్తే వారికి నోటీసులు జారీ చేయాలని ఆమె పేర్కొన్నారు. ఓటర్ లిస్టులకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసిన పిదప ప్రతి ఓటరు మ్యాపింగ్ చేయాలని ఓటరు చేర్పులకు సంబంధించి 40 సంవత్సరాల లోపు వైశ్య గల వారిని మాత్రమే కొత్త ఓటరు రక్తసంబందీకుల లింకు చేసి నమోదు చేయాలని ఆమె పేర్కొన్నారు ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి జయంతి, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్, తాసిల్దారు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్టీఎల్ ఆధ్వర్యంలో

# షిప్ డిజైన్ వర్క్‌షాప్-25 నిర్వహణ

### ఆత్మనిర్భర్ నౌకా రూపకల్పన వైపు మరో కీలక అడుగు

విశాఖపట్నం,జయజయహే




రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ( డిఆర్డిఓ) పరిధిలోని ప్రముఖ నౌకా విజ్ఞాన ప్రయోగశాల నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ ల్యాబొరేటరీ ( ఎన్ ఎస్ టి ఎల్ ) ఆధ్వర్యంలో గురువారం “షిప్ డిజైన్ వర్క్‌షాప్ - 2025 ( ఎస్ డి డబ్ల్యు -25)” నిర్వహించారు.”సెల్ఫ్ రిలయన్స్ అండ్ స్ట్రెంగ్త్నింగ్ ఇండైజెనౌస్ షిప్ డిజైన్ ఏకోసిస్టం ” అనే అంశంపై జరిగిన ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం,భారతదేశం యొక్క స్వదేశీ నౌకా రూపకల్పన సామర్థ్యాలను బలోపేతం చేయడం మరియు నౌకా రూపకల్పనలో భాగస్వామ్య సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడం.ఈ వర్క్‌షాప్‌ను డా. ఆర్.వి. హర ప్రసాద్, విశిష్ట శాస్త్రవేత్త మరియు డైరెక్టర్ జనరల్ (నావల్ సిస్టమ్స్ మెటీరియల్స్), డిఆర్డిఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా రియర్ అడ్మిరల్ సుజిత్ బక్సి (డీజీ, వర్షిప్ డిజైన్ బ్యూరో), డా. అబ్రహాం వరుగీస్ (డైరెక్టర్, ఎంఎస్టిఎల్ ), కమోడోర్ (రిటైర్డ్) గిరిదీప్ సింగ్ ( సీఎండి,హెచ్ ఎస్ ఎల్ ) తదితరులు పాల్గొన్నారు.భారత నౌకాదళం, డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ప్రైవేట్ షిప్‌యార్డులు, క్లాసిఫికేషన్ సొసైటీలు మరియు అకడమిక్ సంస్థల నుండి సీనియర్ ప్రతినిధులు హాజరయ్యారు.డా. హర ప్రసాద్ మాట్లాడుతూ భారత నౌకా వ్యవస్థల్లో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో స్వదేశీ నౌకా రూపకల్పనకు కీలక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.

భవిష్యత్ నౌకా రూపకల్పనలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (ఏ ఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం ఎల్), డిజిటల్ ట్విన్స్ మరియు మెటా మెటీరియల్స్ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించడం అవసరమని సూచించారు.అలాగే, గ్రీన్ షిప్ టెక్నాలజీస్, ఎనర్జీ ఎఫీషియెంట్ ప్రొపులషన్ సిస్టమ్స్ మరియు సస్టైనబుల్ మెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణానికి అనుకూలమైన నౌకా రూపకల్పన దిశగా అడుగులు వేయాలని సూచించారు.తాజాగా లార్జ్ క్యావిటేషన్ టన్నెల్ ఫెసిలిటీ ఏర్పాటులో ఉందని, ఎన్ ఎస్ టి ఎల్ లోని వివిధ పరీక్షా సదుపాయాలను పరిశ్రమలు మరియు విద్యాసంస్థలు ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఎం ఎస్ టి ఎల్ ను ప్రపంచ ప్రామాణిక హైడ్రోడైనమిక్ పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దిశగా కృషి జరుగుతోందని చెప్పారు.రియర్ అడ్మిరల్ సుజిత్ బక్సి మాట్లాడుతూ,డిఆర్డిఓ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని నౌకా రూపకల్పన భాగస్వాములను ఒక వేదికపైకి తీసుకువచ్చిన ఎన్ ఎస్ టి ఎల్ ప్రయత్నం చారిత్రాత్మకమని అభినందించారు.భారత నౌకాదళం డిఆర్డిఓ పరిశ్రమలు, అకడమిక్ సంస్థలతో కలసి స్వదేశీ నౌకా రూపకల్పన సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.డా. అబ్రహాం వరుగీస్ స్వాగత ప్రసంగంలో ఎన్ఎస్టిఎల్ సంస్థ సముద్రాంతర్గత వ్యవస్థలు,హైడ్రోడైనమిక్స్, స్టెల్త్ టెక్నాలజీ రంగాల్లో చేసిన కృషిని వివరించారు.ఈ వర్క్‌షాప్ రూపకల్పన నిపుణులు, షిప్ బిల్డర్లు, పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థల మధ్య సంభాషణకు ప్రత్యేక వేదికగా నిలుస్తుందని తెలిపారు.వర్క్‌షాప్‌లో హైడ్రోడైనమిక్స్, స్టెల్త్ టెక్నాలజీస్, హై-స్పీడ్ టోవింగ్ ట్యాంక్, సీ కీపింగ్ బేసిన్, క్యావిటేషన్ టన్నెల్, విండ్ టన్నెల్, మోడల్ మాన్యుఫాక్చరింగ్ వంటి ఎన్ ఎస్ టి ఎల్ సామర్థ్యాలపై ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే, “కాలేబరటివ్ షిప్ డిజైన్ డెవలప్మెంట్ రోడ్మాప్ ” పేరుతో రూపొందించిన సమగ్ర రోడ్‌మ్యాప్‌ను కూడా విడుదల చేశారు.మొత్తం 100 మందికి పైగా నౌకాదళ,డిపిఎస్యూస్, ప్రైవేట్ షిప్‌యార్డులు, అకడమిక్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం భారతదేశం యొక్క ఆత్మనిర్భర్ సముద్ర సాంకేతికత లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.



## ఆర్ టి సి బస్ డ్రైవర్లకు, కండక్టర్లకు

# అవగాహన సదస్సు

అనకాపల్లి , జయజయహే

అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటనారాయణ ఆర్టీసీ డిఎం వారి సమక్షంలో బస్సు డ్రైవర్లకు కండక్టర్లకు అవగాహన సదస్సు లో వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో సిబ్బందికి పలు సూచనలు ఇస్తూ బస్సులను ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేయవద్దని ప్రయాణికులను వేలాడే విధంగా ఎక్కించుకోవద్దని ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు బస్సు ఎక్కి లోపలికి వెళ్లే గుమ్మాల వద్ద వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారని ఇలాంటివి జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రమాదం జరిగాక మనం విచారించిన ప్రయోజనం ఉండదని తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు పలు సూచనలు చేయడం జరిగింది. ఇటీవల నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది ఒక వ్యక్తి మరణించాడు అని కేసు నమోదు చేయడం జరిగిందని ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్త వహించాలని వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్ కు ముందు వైపు డ్రైవర్కు కుడి పక్క ఎడం పక్క గమనిస్తూ బస్సును తీయాలని లేనిచో అవే ఒక్కొక్కసారి పొరపాట్లు జరిగి ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటాయని వారి పేర్కొన్నారు కనుక ప్రతి ఫస్ట్ డ్రైవర్ కండక్టర్ తమ వాహనం నడిపేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకుని ముందుకు వెళ్లాలని వారు పేర్కొన్నారు



## రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగకృష్ణకు సత్కారం

జంగారెడ్డిగూడెం, జయజయహే

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీ ఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పాదం నాగ కృష్ణను స్థానిక జనసేన మున్సిపల్ కౌన్సిలర్ వలవల తాతాజీ ఆధ్వర్యంలో సత్కరించారు.పోలవరం కు చెందిన నాగకృష్ణ గురువారం స్థానిక మున్సిపాలిటీ ని సందర్శించి కమీషనర్ కె . వెంకట రమణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగ కృష్ణ ను, కమీషనర్ రమణ,వలవల తాతాజీ తదితరులు ఘనంగా సత్కరించారు. కమిషనర్ రమణ మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ విషయంలో డైరెక్టర్‌తో కలిసి ముందుకు వెళతామని తెలిపారు. తాతాజీ మాట్లా డుతూ కష్టపడిన కార్యకర్త నాగ కృష్ణను గుర్తించి రాష్ట్ర స్థాయి పదవిపచ్చదనం, సుందరీకరణ విభాగం డైరెక్టర్ పదవికి ఎంపిక చేయటం పై కూటమి ప్రభుత్వం కు అభినందనలు తెలిపారు. డైరెక్టర్ నాగ కృష్ణ మాట్లాడుతూ నా మీద పెట్టిన బాధ్యతలు ను సక్రమంగా నిర్వహిస్థానినీఅన్నారు. పట్టణం సుందరీకరణ విషయంలో అందరితో కలిసి ముందుకు వెళతానని తెలిపారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, సీనియర్ నేత కరాటంరాంబాబు, జిల్లా జనసేన కార్యదర్శి కరాటం సాయి బాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్య మంత్రి చంద్రబాబు కు, నియోజకవర్గం ఇంచార్జి, తదితర పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోజనసేన నాయకుడు ఏపురీ సతీష్ రాజేష్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించం

### రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రు నాయుడు

దేవరాపల్లి, జయజయహే

సజావుగా సాగిన మండల సర్వసభ్య సమావేశాన్ని వైసిపికి చెందిన ప్రజా ప్రతినిధులు తప్పుతోవ పట్టించారని రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, కలిగొట్ల పిఎసిఎస్ అధ్యక్షులు దొగ్గ దేముడు నాయుడు అన్నారు. రైవాడ అతిథి గృహం వద్ద గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిండు సభలో అసత్య ఆరోపణలు చేయడానికి ఖండించామని, ప్రోటోకాల్ ప్రకారం అధికారుల ఆహ్వానం మేరకు సభకు హాజరయ్యామని స్పష్టం చేశారు. సభాధ్యక్షత వహించిన ఎంపీపీ బుల్లి లక్ష్మి ఉండగా, అన్ని తనై జడ్పిటిసి కర్రి సత్యం సభను నడిపించడమేమిటని వారు ప్రశ్నించారు. ఇది ప్రోటోకాల్ కు విరుద్ధం కాదా అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అటువంటి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదని పాత్రు నాయుడు, దేముడు నాయుడు అన్నారు.




## అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తి చేయాలి

### సిపిఎం మండల కార్యదర్శి బి.టి దొర

దేవరాపల్లి, జయజయహే

మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పూల గరువు, బుచ్చింపాలెం, రామన్నపాలెం, బొడ్డగుమ్మి గ్రామం గిరిజనులు అసంపూర్తి రోడ్లను వెంటనే పూర్తి చేయాలని నినాదాలు చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్లు పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నమన్నారు. పల్లె పండగ పేరుతో చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయాయని సిపిఎం మండల కార్యదర్శి బి.టి దొర విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూడ దేముడు, కూడ ఈశ్వరరావు, సోముల రమణబాబు, దుప్పి సోమయ్య, దుప్పి దాసు తదితరులు పాల్గొన్నారు.




## బిషప్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులుగా సాల్మన్ రాజు ఎంపిక

దేవరాపల్లి, జయజయహే

ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు ఎంపిక బుధవారం విజయవాడలో జరిగింది. ఈ ఎంపికలో దేవరాపల్లికి చెందిన బిషప్ సాల్మన్ రాజు బంగారిని క్రైస్తవ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ లో రాష్ట్ర కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎన్నుకున్నారు. అలాగే అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైనట్లు సాల్మన్ రాజు బంగారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ కార్యవర్గానికి దేవరాపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ క్రైస్తవ నాయకులు అభినందనలు తెలుపుతూ, సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజును రాష్ట్ర కమిటీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు.

# ముగిసిన పోషకాహార మహోత్సవాలు

దేవరాపల్లి, జయజయహే




కే కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన పోషకాహార మహొత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం దేవరాపల్లిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సిడిపిఓ లలిత కుమారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పిటిసి కర్రి సత్యం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గర్భవతులు బాలింతలు, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారించడం కోసం ప్రభుత్వ సరఫరా చేసిన ఆహార పదార్థాలలో ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని అన్నారు. స్థానికంగా దొరికే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఉపయోగించుకోవాలని అన్నారు. తహసీల్దార్ పి. లక్ష్మీదేవి మాట్లాడుతూ గర్భవతిగా ఉన్నప్పుడే కాదు, తర్వాత కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. సిడిపిఓ లలిత కుమారి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి స్త్రీలు, శిశువులకు సమతుల్య ఆహారం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల్లో పోషకాహారం ప్రాధాన్యం అవగాహన కల్పించడం లక్ష్యమన్నారు. దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మాట్లాడుతూ అధిక బరువు ఇచ్చే ఆహార పదార్థాలు పిల్లలకు పెట్టకూడదని, పోషణ మరియు ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు భాగస్వామ్యం వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, అంగన్వాడి సూపర్వైజర్లు రాములమ్మ, కళ్యాణి, ఆదిలక్ష్మి, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయజయహే

# హైడ్రో పవర్ ప్రాజెక్టుల వ్యతిరేక జ్వాల

**అరకులోయ, జయజయహే**



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసులు, గిరిజన సంఘాలు హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకంగా గట్టి పోరాటానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కపట నాటకాలు ఆపాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలకు సంబంధించిన జీఓలు 2, 13, 51ను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలోని లోతేరు గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తూ డిమాండ్ చేసారు. ఈ ఒప్పందాలు రద్దు కాకపోతే పోరాటం ఆగదని ఆదివాసి గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. అనంతగిరి, అరకువేలి, హుకుంపేట, చింతపల్లి, జికే వీధి, కొయ్యూరు మండలాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ కంపెనీలైన నవయుగ, అదాని, శిరిడి సాయి ఎలక్ట్రికల్, మెగా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందాలు, జీవోలు, పర్యావరణ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 17న పాడేరు కలెక్టరేట్‌కు వేలాది ఆదివాసులు తరలిరావాలని ఈ సంఘాలు పిలుపు నిచ్చాయి. పోరాట కమిటీ సమావేశంలో కీలక తీర్మానాలులోతేరు, అడారి గ్రామాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కిల్లో నోబో అధ్యక్షతన జరిగిన సమావేశంలో, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ రెండు నెలలుగా ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం జీఓలు 2, 13, 51 రద్దు చేయలేదని విమర్శించారు. గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి తాత్కాలిక పనులు ఆపినట్టు ప్రకటించినప్పటికీ, ఈ అంశం మంత్రివర్గంలో లేదా గిరిజన సలహా మండలిలో చర్చించబడిందా అని స్పష్టత కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఆదివాసుల నిరసనకు అనుమతి ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1/70 చట్టం, పెసా గ్రామసభ చట్టం, అటవీ హక్కుల చట్టాలు ఉల్లంఘించి, ఈ ఒప్పందాలు చేసుకున్నారా? అని ప్రశ్నించారు. జిల్లా అధికారులు, పోలీసు శాఖ కార్పొరేట్ మేనేజర్లలా వ్యవహరిస్తున్నారని, సీలేరు ప్రాజెక్టులో భూమి పూజ చేసిన మెగా కంపెనీలపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కొత్త ఆరోపణలు......**

కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాలపై పర్యావరణ అనుమతులు ఇచ్చి, ఆదివాసి ప్రాంతాల్లో రోడ్లు వేయకుండా ఫారెస్ట్ చట్టం పేరిట అడ్డుకుంటోందని ఆరోపించారు. మోదీ ప్రియ మిత్రుడైన అదాని, నవయుగ, శిరిడి సాయి ఎలక్ట్రికల్, మెగా కంపెనీలకు అనుమతులు ఇచ్చి, ఆదివాసులకు 'జల సమాధి' చేయాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సదస్సు జరుపి ఆదివాసుల సంపద దోచుకుంటున్నారని, ప్రధానమంత్రి మోదీకి పర్యావరణ అనుమతులు రద్దు చేసిన తర్వాతే ఆంధ్ర పర్యటనకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూజారి త్రినాథ్, పెసా కమిటీ సభ్యులు, భీమ పోరాట కమిటీ నాయకులు రామచందర్, అప్పలస్వామి, త్రినాథ్, స్వాభి మంగళయ్య, కిల్లో మొద్దు ఆనంద్, శోభన్, కిల్లో భీమల చంప, ముక్తా తులాసమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఈఓ ని మర్యాదపూర్వకంగా కలిసిన బోర్డు మెంబర్ కొప్పర్ల నాగరాజు

**శ్రీకాళహస్తి, జయజయహే**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులు కొప్పర్ల. నాగరాజు ఈవో బాపిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కొప్పర్ల. నాగరాజును సన్మానించడం జరిగింది. శ్రీకాళహస్తి ఇరిగేషన్ టెక్నికల్ ఆఫీసర్ వంకీపురం. వేణు దుశ్యాలావతో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం ఆయన జ్ఞానప్రసునాంబసమేత వాయు లింగేశ్వర స్వామిని దర్శించుకుని వేద పండితులచే ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట. చంద్రశేఖర్, విజయనగరం, అనకాపల్లి జిల్లాల నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు జి సత్యనారాయణ, పి. రమేష్, రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, పి. సత్యనారాయణ రాష్ట్ర సాధికారతి కమిటీ సభ్యులు కోటిపల్లి. చంద్రశేఖర్, కాకినాడ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు చిప్పల. శీను, తదితరులు పాల్గొన్నారు.





## ఈనెల 19న జిల్లాస్థాయి యోగ పోటీలు

### ఎమ్మెల్యే రాజుకి ఆహ్వానం

**చోడవరం, జయజయహే**

ఈనెల 19న చోడవరం ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో 8 సంవత్సరాల పిల్లల నుండి 80 యాళ్ల వృద్ధుల వరకు అనకాపల్లి జిల్లా స్థాయి యోగాసనాలు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం చోడవరం శాసనసభ సభ్యులు ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజుని ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా పోస్టు రిలీజ్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి శేష అశోక్ చోడవరం టౌన్ టిడిపి అధ్యక్షులు ఎర్రంశెట్టి చిన్న గణేష్ డిఫెన్స్ అకాడమీ పుల్లేటి గణేష్ పాల్గొన్నారు.



## పొంగలి పాకలో స్వచ్ఛంధ్ర స్వచ్ఛభారత్

**మాడుగుల, జయజయహే**

మాడుగుల మండలం పొంగలిపాక గ్రామంలో గురువారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా గ్రామంలో రోడ్డుకి ఇరువైపుల గల తుప్పులు డొంకులను గ్రామస్తులు సహకారంతో స్వచ్ఛందంగా తొలగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ నాయన దేవుడమ్మ, సత్యనారాయణ కింతల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ ఉండూరు దేముడు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు శెట్టి సత్తిబాబు, కరణం పోతురాజు, జనసేన కార్యకర్తలు పచ్చికొర నాగు ఉండూరు కుమారు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర తుప్పలు డొంకలు తొలగించుట, డ్రైనేజీలు శుభ్రపరచుట తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మై చర్ల సన్యాసిరావు, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం, అగ్రికల్చరల్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు, పాల సంఘం అధ్యక్షులు నాయుడు జోగి నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు బంటు మల్లు నాయుడు, పచ్చి కోర ఇరుకు నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ దంట్ల రవి తదితరులు అందరూ పాల్గొన్నారు.

# వేలాది మందికి ఆకలి తీరుస్తున్న సద్భావి ఫ్రిడ్జ్

### ఘనంగా సద్భావ ఫ్రిడ్జ్ వార్షికోత్సవ వేడుకలు

**చోడవరం, జయజయహే**

ఏడాది క్రితం చోడవరం స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ద్వారా వేలమందికి ఆకలి తీరుతుందని చోడవరం ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, సబ్ రిజిస్టర్ గీత లక్ష్మి అన్నారు. సి డి వి ఎం కమ్యూనిటీ ఫౌండేషన్ సద్భావ టీం ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబరు 16న స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటుచేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా గురువారం అక్కడ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాది కాలంలో ఎందరో ఆకలి తీర్చుకున్నారని చెబుతూ నిర్వహకులను సహకరించిన వారందరినీ అభినందించారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలు తమ ఇళ్లలో జరిగే కార్యక్రమాల భాగంగా ఈ ఫ్రిడ్జ్ ద్వారా కూడా అన్నదానం చేస్తున్నారని ఇది చూడను పట్టణంలో ఒక ఆచారంగా మారిందని చెప్పారు. చోడవరం పట్టణంలో నిరుపేదలతో పాటు వివిధ పనులపై వచ్చేవారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ రాజేష్ ని నిర్వాహక సభ్యులను అభినందిస్తూ నిత్యం ఫ్రిడ్జ్ వద్ద సేవలందిస్తున్న పలువురుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.




## జీఎస్టీ వ్యాసరచన పోటీలో మాడుగులకి ప్రథమ స్థానం

**మాడుగుల, జయజయహే**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ టు స్లాబ్ తగ్గించిన నైవేద్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా పాఠశాల విద్యార్థులకు జీఎస్టీ పై వ్యాసం పోటీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ పోటీలలో మాడుగుల మండలానికి చెందిన బాలిక ప్రథమ స్థానం కైవాసం చేసుకుందనీ ఎంఈఓ బి దేవుడమ్మ గురువారం తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒకరు జిల్లా పోటీలకు హాజరవుగా మాడుగుల మండలం కేజే పురం హైస్కూల్ విద్యార్థిని కే మోహిత ప్రథమ స్థానం దక్కించుకుంది. దీంతో అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు బహుమతి అందజేసి ప్రశంసించారనీ తెలిపారు.



## జీఎస్టీపై రవాణా శాఖ అవగాహన కార్యక్రమం

**చోడవరం, జయజయహే**

తగ్గించిన జిఎస్టిపై గురువారం చోడవరం పట్టణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి రాజన్న వాహన షోరూములు తనిఖీ చేసి ప్రజలకు జీఎస్టీ మీద అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారుడు తేజ రెండు లక్షల 50 వేల రూపాయల యమహా వాహనంపై జిఎస్టి తగ్గింపు ధరలో 25000 తగ్గింపుతో వాహన కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా బజాజ్ షోరూం, హీరో షోరూం సిబ్బంది, ఆటో సిబ్బంది, వాహనదారులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా కొత్తూరు జంక్షన్ లో నిర్వహించిన మానవహారంలో జిఎస్టి అధికారి కిషోర్ కుమార్, ఎంపీడీవో ఆంజనేయులు, రవాణా శాఖ అధికారి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి రాజన్న తదితరులు పాల్గొన్నారు.




## యూరియా కోసం రైతుల పాట్లు

**చోడవరం, జయజయహే**

యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సకాలంలో కావలసిన యూరియా అందుబాటులోకి రాకపోవడంతో అవసరాలు తీరడం లేదని రైతులు వాపోతున్నారు. తెర అప్పుడప్పుడు వస్తున్న యూరియా కోసం దుకాణాల వద్ద పడికాపులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం చోడవరం కొత్తూరు జంక్షన్ లో గల ఒక దుకాణం వద్ద రైతులు బారులు తీరారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తమ సర్వ చూపి ఇప్పటికైనా సరే రైతులకు కావలసిన యూరీయను ఎక్కడ ఎక్కడ అందుబాటులోకి రావాలని కోరుతున్నారు.

## ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు

**మాడుగుల, జయజయహే :**

మాడుగుల మండలంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎండిఓ కే అప్పారావు గురువారం తెలిపారు. కే వల్లపురం, కే జే పురం గ్రామస్తుల సౌకర్యార్థం ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేవలం గ్రామస్తులకు సంబంధించి ఈ నెల 23 న కింతలి, 24న గాదిరాయి, 25న నరసయ్యపేట, 27, 28న ఒమ్మలీ, 29న కేజీబీవీ సాగరం, 30న తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తారన్నారు. అలాగే కేజీ పురానికి సంబంధించి 23న కేజే పురం హై స్కూల్, 24 జి అగ్రహారం హై స్కూల్, 25న వీరనారాయణ హై స్కూల్, 27, 28 తేదీల్లో మాడుగుల హై స్కూల్, 29న మాడుగుల గర్ల్స్ హై స్కూల్, 30న ఎం కోడూరు హైస్కూల్లో నిర్వహిస్తారని కాబట్టి ఆ గ్రామస్తులు సద్వినియోగపరచుకోవాలన్నారు.



# ఉపాధి హామీ పథకం ద్వారా ఉపయోగం లేని మొక్కలు సరఫరా చేస్తే ఎలా!





## ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం వెంకటేశ్వర్లును నిలదీసిన వైస్ ఎంపీపీలు, సభ్యులు

## వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

## పలు సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

**ముంచంగిపుట్టు, జయ జయహే**

గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా అందిస్తున్న చిన్నపాటి సిల్వర్ మొక్కలు వలన ఎటువంటి ఉపయోగం లేదని, వాటిని ఎందుకు సరఫరా చేస్తున్నారని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎంవెంకటేశ్వర్లును వైస్ ఎంపీపీలు పి.సత్యనారాయణ, ఎస్. భాగ్యవతి లతో పాటు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశంలో నిలదీశారు. నాణ్యమైన, ఎత్తైన మె ఎక్కలను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్ష తన మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. పలు సమస్యలపై సభ్యులు అధికారులపై జప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పంపిణీ చేస్తున్న సిల్వర్ మొక్కలు పలు పంచాయతీలకు కేవలం ఐదు సెంటీమీర్లు ఎత్తు దాటడంలేదని, కనీసం 50 సెంటీమీటర్లు ఎత్తు దాటిన, నాణ్యమైన మొక్కలను, సకాలంలో పంపిణీ చేయాలని సభ్యులు అన్నారు. చిన్నపాటి మొక్కలు సరఫరా చేయడం వలన వెయ్యి మొక్కలు నాటితే కేవలం రెండు వందల మొక్కలు బ్రతకడం కష్టంగా ఉంటుందని తెలిపారు. అలాగే గిరిజన ప్రాంతంలో బ్రతికే మొక్కల రకాలను, కాలానికి అనుగుణంగా పంపిణీ చేయాలని, పెన్సింగ్ ఇవ్వాలని, స్థానికంగా నర్సరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడియం నుంచి రప్పిస్తున్న మొక్కలు కొన్ని రకాలు ఈ ప్రాంత వాతావరణంకు బ్రతకడంలేదని తెలిపారు. దీంతో స్పందించిన ఏపీఎం గతంలో సిల్వర్ మొక్కలు చిన్నవి వచ్చాయని, వాటి స్థానంలో పెద్ద మొక్కలు రప్పించి ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ మండల పరిధిలో నూతనంగా 66 మంది ఉపాధ్యాయ నియమితులయ్యారని, ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, 43 పాఠశాలల నూతన భవనాల నిర్మాణం పనులకు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. బరడ, రంగబయలు పంచాయతీ పరిధిలో పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేరని, ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచులు ఎంఈవోని కోరారు. విద్యా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, పలు పాఠశాలల విద్యార్థులకు ఆశించిన స్థాయిలో చదువు రావడంలేదని, అటువంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వైస్ఎంపీపీలు అన్నారు. లబ్బూరు ఏకలవ్య పాఠశాల నిర్మాణం పనులు పూర్తి కాకుండానే, అసౌకర్యాల నడుమ ప్రారంభోత్సం ఎందుకు చేశారని, దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు విద్యాశాఖ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో తాగునీటి సమస్య చాలా ఎక్కువగా ఉందని, నీటి సమస్యను పరిష్కరించాలని, మోనూ పక్కాగా అమలు చేయాలని, పూర్తి స్థాయిలో భవనాలు, ప్రహారీ గోడ నిర్మాణం పనులు జరిగే విధంగా చూడాలని సభ్యులు అధికారులను కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎంపీడీవో ధర్మారావు అన్నారు. కిలగాడ పీహెచ్ సీ సీహెచ్ ఎస్ సౌరప్పడు మాట్లాడుతూ పీహెచ్సీ వైద్యులు సమ్మెలో ఉన్నారని, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేవిధంగా తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రసవాలుకు గర్భిణీలు ఆస్పత్రులకు రావాలని కోరారు. తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్ వాహనం గత మూడు నెలలుగా పనిచేయకపోవడంతో పక్క మండలాల నుంచి వాహనాన్ని తీసుకువచ్చి వాడటం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్ సీ) వైద్యులు ఎందుకు హాజరుకాలేదని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. సీహెచ్ సీలో వైద్య విధాన్ పరిషత్ అధికారులతో సమావేశంలో ఉండటం వలన వారు హాజరుకాలేదని చెప్పారు. లబ్బూరు అంబులెన్స్ వైద్యాధికారి రాకపోకలు సాగిం చేందుకు వాడుకుంటున్నారని, నిత్యం రోగులకు అందుబాటులో ఉండే విధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూడాలని సభ్యులు అన్నారు. సి హెచ్ ఎస్ కి వచ్చే రోగులకు సకాలంలో సంపూర్ణ వైద్య సేవలు అందడంలేదని, అంబులెన్స్ అలంకార ప్రాయంగా ఉందని, 108 అత్యవసర వాహనానికి కాల్ చేసినా సకాలంలో రావడంలేదని సభ్యులు ధ్వజమెత్తారు. రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందే విధంగా చూడాలని, ఆస్పత్రులలో పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని, అంబులెన్సు కండీషన్లో ఉండే విధంగా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే పలు సచివాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని, సచివాలయం సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సభ్యులు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలద్వారా పిల్లలకు గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం సకాలంలో అందే విధంగాచూడాలని, పక్కా భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి, నూతన భవనాలు నిర్మించాలని, దెబ్బతిన్న భవనాలకు మరమ్మత్తు పనులు జరిగే విధంగా తగు చర్యలు చేపట్టాలని సీడీపీవో విమల కుమారికి సభ్యులు తెలిపారు. అలాగేరెవెన్యూ అధికారులు పని తీరు సక్రమంగా లేదని, ఎవరికి పడితే వారికి ఎల్పీసీలను ఇచ్చేయడం వలన భూ తగువులు ఎక్కువ అవుతున్నాయని సభ్యులురెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే చేపట్టి నెలలు కావస్తున్నానేటికీ రైతులకు భూ పట్టాలు ఎందుకు అందించలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఎవరికి పడితే వారికి ఎల్పీసీలు ఇస్తున్న రెవెన్యూ అధికారులు

గ్రామీణ బ్యాంక్ భవన నిర్మాణంకు ప్రభుత్వ స్థలాన్ని ఇవ్వలేకపోవడం విచారకరమని అన్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లా'డుతూ ప్రకృతి వ్యవసాయ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు శ్రమిస్తున్నారని, అందుకు అందరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. రాయితీపై వ్యవ సాయ యంత్రాలు, పనిముట్లను అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుందని చెప్పారు. రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసన భారీ వర్షాలకు మండల పరిధిలో దెబ్బతిన్న వరి పంటకు నష్టపరిహారం అందే విధంగా చూడాలనిఏవోని సభ్యులు కోరారు. అలాగే ఇరిగేషన్ అధికారులు ఎవరూ అందుబాటులో ఉండటం లేదని, భారీ వర్గాలు కారణంగా పంట పొలాల గట్లు వరదనీటి ఉధృతికికొట్టుకుపోయాయని, ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళదాం అనుకున్నా వారి జాడ కానరావడంలేదని, వారు అందుబాటులో ఉండే విధంగాతగు చర్యలు చేపట్టాలని సభ్యులు ఎంపీడీవోని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సురేష్ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పంచాయతీలకు సంబంధించి నిధులు రూ.15 లక్షలు మజూరు అవుతుందని, విద్యుత్ బిల్లులు మాత్రం రూ.20లక్షలు దాటి వస్తుందని, పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన నిధులు విద్యుత్ బిల్లులు కట్టేందుకే సరిపోవడంలేదని సభ్యులు అన్నారు. విద్యుత్ బిల్లులు చాలా ఎక్కు వస్తున్నాయని, పంచాయతీ అభివృద్ధి పనులు ఎలా చేయాలని విద్యుత్శాఖ ఏఈని సభ్యులు ప్రశ్నించారు. బిల్లులు ఎందుకు ఎక్కువ వస్తుందో తెలుసుకొని తమకు తెలియజేయాలని సభ్యులు కోరారు. అలాగే బరడ పంచాయతీ సొలగంపుట్టు గ్రామంలో రెండు విద్యుత్ స్థంబాలు, వనుగుమ్మ పంచాయతీ డొమినిపుట్టు విద్యుత్ స్థంబం ప్రమాదబరితంగా ఉన్నాయని, పెదగూడ పంచాయతీ పనసపుట్టు గ్రామంలో విద్యుత్ కేబుల్ వైరు మార్చాలని, కిలగాడ పంచాయ కేంద్రంలో విద్యుత్ స్థంబాలు వేసేందుకు గాతలు తీసి వదిలేసారని, స్థంబాలు వేయకపోవడంతో ప్రస్తుతం గాతలు ప్రమాదబరితంగా మారాయని సభ్యులు ఏఈ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఆర్టీసీ అధికారులు మండలంలో గల మారుమూల లక్ష్మీపురం, బుంగా పుట్టు, సుజనకోట తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడపాలని, హౌసింగ్ అధికారులు గృహ లబ్దిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు అయ్యే విధంగా చూడాలని, ఆర్యంబ్బీ అధికారులు రహదారికి ఇరువైపులా జంగిల్ కటింగ్, దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తునులు జరిగే విధంగా చొరవ చూపాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఇతర శాఖల అధికారులను సైతం సమస్యలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయా శాఖ అధికారులు ఈ సందర్భంగా సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# విభాగాల కార్యాలయాలలో ఆకస్మికంగా తనిఖీ చేసిన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్





**ఆంధ్రవిశ్వవిద్యాలయం, జయజయహే :**

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ నేడు పలు విభాగాలను, కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. కార్యక్రమంలో భాగంగా మెటీరియాలజి, ఓషనోగ్రఫీ విభాగాలను తనిఖీ చేసారు. అక్కడ బోధనా మరియు బోధనేతర సిబ్బంది యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా విభాగంలో తరగతులు జరుగుతున్నా విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు . విభాగపు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విభాగ అవసరాలకు సంబంధించి ఏమైనా అవసరాలు ఉంటే తమదృష్టికి తేవాలని సూచించారు. వాతావరణ శాస్త్ర విభాగం ప్రాంగణంలో ఉన్న కాలుష్య తనిఖీ వాహనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వాహనానికి అవసరమైన డ్రైవర్ను ఏర్పాటు చేయాలని కోరుతూ సంబంధిత విభాగానికి లేఖ రాయాలని సూచించారు. అదే విధంగా ఐఐటిఎంతో ఇటీవల చేసుకున్న ఒప్పందంలో భాగంగా కొన్ని సాంకేతిక పరికరాలు ఇప్పటికే ఏయూకు చేరాయి. వీటి ఇనస్టలేషన్ పనుల ప్రగతిని వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ పరికరాలు ఏర్పాటుకు అవసర మైన విద్యుత్ సరఫరా వ్యవస్థను ముందుగా ఏర్పాటు చేసుకోవాలని, ఐఐటిఎం నుంచి ఇనస్టలేసష న్ ఇంజనీర్లను పిలచి నూతన పరికరాలను ఇనస్టలేషన్ చేయించాలని తెలిపారు. అదే విధంగా ఇంజినీర్స్ కార్యాలయాన్ని సైతం ఆకస్మికంగా తనిఖీ చేసారు అక్కడ అధికారులు, ఇతర సిబ్బంది యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. పూర్తీ నిబద్ధతతో విధులను నిర్వహించాలని సూచించారు.



## కొప్పాక ప్రాంత మురికి నీరు ఏలేరు కెనాల్‌లో రాకుండా చర్యలు తీసుకున్న వీస్కో ఏ డి సి చైర్మన్

**విశాఖపట్నం, జయజయహే :**

జీవీఎంసీ కమిషనర్, విశాఖ ఇండస్ట్రియల్ వాటర్ సప్లై కంపెనీ చైర్మన్ కేతన్ గార్గ్ ని ఏడీసీ చైర్మన్ బలరెడ్డి సత్యనారాయణ కలిసి కొప్పాక పరిసర ప్రాంతాల్లో గృహ నివాసకులు మురికి నీరు, మలవిసర్జనలు జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఏలేరు కాలువలో కలుస్తున్నాయి. ఏలేరు కాలువలో వచ్చే గోదావరి నీటినిఎన్టిపిసి ,హిందూజ, ఫార్మాసిటీ, విశాఖ స్టీల్ ప్లాంట్, గాజువాక నియోజకవర్గం ప్రజలు ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పలు వ్యాధులు వస్తూ ఇబ్బంది పడుతున్నారు. కావున జివిఎంసి 84 వార్డు కొప్పాక ప్రాంత మురికి నీరుని ఏలేరు కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా వినతి పత్రం గతంలో ఇవ్వడం జరిగినది. విస్కో చైర్మన్ స్పందించి ఏటికొప్పాక మురికి నీరుని ఏలేరు కెనాల్ లో కలవకుండా పనులు చేపట్టడం జరిగినది. కొప్పాక నుండి వచ్చే మురికి నీటిని పైపు ద్వారా ఏలేరు కెనాల్ నీటిపై నుండి అటువైపు ఒడ్డికి తరలించి తద్వారా చెరువులోకి పంపించడం జరుగుతున్నది. సమస్యపై స్పందించి తగు చర్యలు తీసుకుంటున్న జీవీఎంస్ కమిషనర్ కి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి, 84 వ వార్డు కార్పొరేటర్ మాధవశెట్టి చిన్నతల్లి నీలబాబు కి విస్కో అధికారులకు బలరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. డిస్కో వర్క్ ఇన్స్పెక్టర్ ఆర్ శ్రీనివాసరావు, జిల్లా టిడిపి కార్యదర్శి పూడి సత్యారావు పాల్గొన్నారు.



## శ్రీ సత్య సాయి బాబా శత వర్ష జన్మదినోత్సవ వేడుకలకు భారత రాష్ట్రపతికి ఆహ్వానం

**ఢిల్లీ, జయజయహే**

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష జన్మదినోత్సవ వేడుకల ఏర్పాట్లలో భాగంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మల్లికా శ్రీనివాసన్ తో కలిసి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ను మర్యాదపూర్వకంగా కలసి భగవాన్ జన్మ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనవలసిందిగా సాదారంగా ఆహ్వానించారు. రాష్ట్రపతి ఆ ఆహ్వానాన్ని సంతోషంతో స్వీకరించి భగవాన్ శ్రీ సత్య సాయి బాబావారి శత వర్ష జన్మదినోత్సవ వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించబడుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. భగవాన్ ఆచరణలో చూపిన మహోన్నత సద్గుణాలను ఆమె కొనియాడుతూ, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి ఉపదేశాల స్ఫూర్తితో సాగుతున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. భారత రాష్ట్రపతి శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ అందిస్తున్న ఉచిత ఆధునిక ఆరోగ్యసేవలు, విద్యా సేవలు, సామాజిక సేవల వంటి మానవతా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, సేవామార్గంలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ అందిస్తున్న స్ఫూర్తిదాయక సేవలను అభినందించారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రేమ, కరుణ, నిస్వార్థత వంటి విలువలను ప్రతిబింబిస్తూ, మానవ సేవలో అచంచలంగా కొనసాగుతున్న శ్రీ సత్య సాయి సేవా సంస్థల సేవా కార్యక్రమాలను కూడా ఆమె ప్రశంసించారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వ భక్తులలో పెద్ద సంఖ్యలో ఒడిశా రాష్ట్రానికి చెందినవారని, అందులో చాలామంది శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారని రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన చొక్కాకుల లక్ష్మి, జ్యోతి

**పెందుర్తి, జయజయహే**

ఎందుర్తి మండలం, కరకవానిపాలెం గ్రామానికి చెందిన జక్కాన సత్యవతి కుమారుడు కనకరాజు వివాహం కరకవానిపాలెం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి వికె పిసిపిఐఆర్ యుడిఎ మాజీ చైర్ పర్సన్ చొక్కాకుల లక్ష్మి మరియు చొక్కాకుల జ్యోతి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎం. కుమారి, ఆర్. దేవి, జి. ముత్యాలమ్మ, జి దేవి, జి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కోసం డిపోలోనే రోజంతా గ్రామస్తులు.. పడిగాపులు

### ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్లలో పంపిణీ చేయాలి.

### పెసా కమిటీ ఉపాధ్యక్షులు. పట్టాసి.రామన్న కొర్ర,మోహన్ రావు డిమాండ్

**అరకులోయ, జయజయహే :**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలి మండలం లోతేరు పంచాయితీ లో రేషన్ కార్డు దారులు వివిధ గ్రామల నుండి గురువారం నాడు లోతేరు డిపోలో రోజంతా పడిగాపులు కాసిన రేషన్ బియ్యం అందని పరిస్థితి లోతేరు పంచాయితీ లో. సిగ్నల్ లేకపోవడం వల్ల డిపోలో వేలి ముద్రలు పనిచేయకపోవడం వల్ల వచ్చిన వృద్ధులు వికలాంగులు పంచాయతీ ప్రజలు అనేక ఇబ్బందితో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు మానుకొని డిపోలోనే పడిగాపులు కాస్తున్నారని ఈ రేషన్ డిపో సమస్యను పరిగణంలోకి అధికారులు తీసుకుని రేషన్ డిపోలో ఆన్లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో రేషన్ బియ్యం ఇస్తే



అందరికీ సమయానికి అందుతుందని. పనులు సీజన్ కావడం వలన పనులు మానేసుకుని డిపోలో వచ్చి రోజంత పడిగాపూలు కాచి వేచి చూడవసనం ఉండదని పంచాయతీ ప్రజలు. లిడంగి తోడుబంద. వంతలగుడ తోటవలస పెద్దవలస పోలిగుడ. తాంగుల బెడ్డ. దుంబ్రిగూడ. గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో. లోతేరు పెసా క్లస్టర్ ఉపాధ్యక్షులు పట్టాసి రామన్న. కొర్రమోహన్ రావు. మాజీ వార్డు సభ్యుడు కిల్లో బీమా. స్పందించి. సేల్స్ మెన్ పుష్ప తో పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



# పెదకోటలో అదికర్మయోగి అభియాన్ గ్రామసభ

### -పివిటీజి గ్రామాలకు మహర్ధశ!

### పలు అభివృద్ధి పనులకు తీర్మాణం

**అనంతగిరి, జయజయహే:**

అనంతగిరి మండలం, పెదకోట పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ ఎస్. అన్నపూర్ణ దేవి ఆధ్వర్యంలో ఆది కర్మయోగి అభియాన్ గ్రామ సభ గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వెనుకబడిన గ్రామాల అభివృద్ధిని లక్ష్యంగా తీసుకుని ప్రధానమంత్రి దిశానిర్దేశంలో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ విజయకుమార్ మాట్లాడుతూ...గ్రామాభివృద్ధి కోసం ప్రాథమిక అవసరాలైన రక్షిత మంచినీటి,గృహ నిర్మాణం,సీసీ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,స్మశాన వాటిక అభివృద్ధి వంటి పలు అభివృద్ధి పనులను గ్రామానికి అందించడమేనని ప్రధాన ఉదేశ్యం అన్నారు. పంచాయతీ పరిధిలో ఎంపిక చేసిన ఆరు గ్రామాల్లో ముందుగా అక్కడే గ్రామసభలు నిర్వహించి, గ్రామానికి,గిరిజనులకు కావాల్సిన పనులను వారి భాగస్వామ్యంతో గురించమన్నారు, అనంతరం పెదకోట పంచాయతీ కేంద్రంలో ఎంపిక చేసిన గ్రామాల ప్రజలు హాజరై గ్రామ సభలో మాడ్రెబు, తునిషిబు,వెలమామిడి, గుమ్మంతి,పాటిపల్లి, రేగులపాలెం గ్రామాలనుండి వినతులు స్వీకరించి పంచాయతీ గ్రామ సభలో తీర్మానం చేశామని తెలిపారు.తయారు చేసిన తీర్మాణాల నీవేదికను జిల్లా కలెక్టర్ తో పాటు ఆయా శాఖల అధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ విజయకుమార్, మాజీ సర్పంచ్,జె.దేముడు,టీడీపీ పంచాయతీ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.గణేష్,జనసేన కార్యకర్త జె.గణేష్,ఫీల్డ్ అసిస్టెంట్ భైరవ మూర్తి, విఓఏ,కె.ఈశ్వరరావు,వార్డు సభ్యులు,సచివాలయ సిబ్బంది,మాడ్రెబు, తునిషిబు,వెలమామిడి, పాటిపల్లి,చిడివలస, రేగులపాలెం గ్రామాలకు ప్రజలు పాల్గొన్నారు.




# విశాఖలో గూగుల్ ఫీవర్

### ప్రధాన జంక్షన్లలో హోర్డింగ్‌ల హల్ చల్

**విశాఖపట్నం, జయజయహే**

దేశంలో ఎన్నడూ లేనంత భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో ప్రతిపాదించిన గూగుల్ డేటా సెంటర్ ఒప్పందంతో విశాఖ నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది. నిన్నంతా స్వీట్లు, బాణాసంచా, పాలాభిషేకాలతో సంబరాలు చేసుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పుడు హోర్డింగ్ లతో ఆనందాన్ని పంచుకుంటున్నారు. మద్దిలపాలెం, సిరిపురం, వెంకోజీపాలెం, పీఎం పాలెం క్రికెట్ స్టేడియం తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. నాడు తండ్రి చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ గతిని మార్చగా.. నేడు కొడుకు నారా లోకేష్ కృషితో రానున్న గూగుల్ విశాఖ అభివృద్ధిని పరుగులు తీయిస్తుందంటూ డిజైన్ చేసిన హోర్డింగ్ లు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తన నియోజకవర్గానికి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన గూగుల్ సంస్థను తీసుకువచ్చినందుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభిమానంతో తండ్రి, కొడుకులిద్దర్నీ గేమ్ చేంజర్లుగా అభివర్ణిస్తూ..ఈ హోర్డింగ్ లు ఏర్పాటు చేయించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఏదేమైనా విశాఖలో గూగుల్ ఫీవర్ మామూలుగా లేదు.



# అక్రమ మైనింగ్ పై మైనింగ్ అధికారులు తనిఖీలు



**రాజమహేంద్రవరం, జయజయహే:**

జిల్లాలోని కోరుకొండ మండలం రాఘనపురం గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ త్రవ్వకాలు జరుగుతున్న సమాచారంపై జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగిందని జిల్లా మైన్స్ అధికారి డి ఫణి భూషణ్ రెడ్డి గురువారం తెలిపారు.తనిఖీ సమయంలో అక్రమంగా గ్రావెల్ త్రవ్వకాలు నిర్వహిస్తున్న గుంతలు, త్రవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి (చైన్ మౌంటెడ్ పాన్) యంత్రాన్ని గుర్తించారు. అప్పుడు అక్కడ ఉన్న ఆపరేటర్ మురమల్ల ప్రసాద్ (మోడకూరు పంచాయతీ, కొత్తపేట గ్రామం) ను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ప్రదేశానికి ఎటువంటి శాఖాపరమైన అనుమతులు లేవని నిర్ధారించడంతో, ఇది అక్రమ త్రవ్వకంగా గుర్తించారు. అనంతరం సర్వే నంబర్లు 44/2, 44/3 లోని ప్రాంతంలో త్రవ్వకాలు జరిగినట్లు గుర్తించి కొలతలు వేయగా, మొత్తం 19,300 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా త్రవ్వబడినట్లు తేలింది. ఆ భూమి వంక బరాజు వెంకట సర్వేశ్వరరావు, వంక వరలక్ష్మి, గునమూరి ఆనందలక్ష్మి, వంక సూర్యకుమారి లకు చెందినదని రాఘనపురం గ్రామ రెవెన్యూ అధికారులు తెలిపారు. అక్రమ త్రవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి యంత్రాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రాఘనపురం గ్రామంలో భద్రపరిచారు. అనుమతి లేని ప్రాంతాలలో త్రవ్వకాలు నిర్వహించినట్లయితే సంబంధితులపై గనులు మరియు భూగర్భ శాఖచే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన గనులలోనే త్రవ్వకాలు, రవాణా నిర్వహించవలసిందిగా సూచించారు. ఈ తనిఖీలో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి డీ. ఫణి భూషణ్



రెడ్డి, సర్వేయర్ పి. శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఎ. శ్రీనివాస్, వి. రామనపురం గ్రామ వీఆర్‌ఏ కె. మురళీ పాల్గొన్నారు.




# పేదవారి కడుపు నింపుతున్న అన్నదాతలు

### 1637 రోజులుగా దాతల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమాలు

**వేములవాడ, జయజయహే**

మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1637 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున లక్ష్మీగణపతి, రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందనినేటి అన్నదాతలుగా అమ్మ జ్ఞాపకార్థం అచ్చన్నపల్లి వాస్తవ్యులు ఏశ పరశురాం పద్మ దంపతులు వీరి కూతుళ్లు మౌనిక రేష్మిత మనుమని పుట్టినరోజు సందర్భంగా గొంగళ్ల రవికుమార్ శ్రీదేవి దంపతులు, జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని, ఒక్కపూట పేదలకు భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 9246939388 నంబరుకు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ వొద్యాల వేణు ప్రతాప నటరాజు పొలాస రాజేందర్ పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# విఎంఆర్‌డిఏను సందర్శించిన కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు

**విశాఖపట్నం, జయజయహే ః**

కె ఎల్ యూనివర్సిటీ బి ఏ, -ఐఏఎస్ విద్యార్థులు దేశీయ టూర్‌లో భాగంగా వి ఎం ఆర్ డి ఏ కార్యాలయాన్ని సందర్శించి చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ను కలుసుకున్నారు. విద్యార్థులు నగర యోజన, అభివృద్ధి, ప్రజా సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి, సదుపాయాల కల్పన వంటి విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎం వి ప్రణవ్ గోపాల్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలి, దాన్ని సాధించేందుకు కష్టపడాలని సూచించారు. సమాజ అభివృద్ధి కోసం మన వంతు ప్రయత్నం చేయాలని చెప్పారు. అనంతరం వివిధ శాఖలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కె ఎల్ యూనివర్సిటీ విభాగాధిపతి డా. కె. అముల్ కుమార్, విభాగ అధ్యాపకులు డా. జి. హేమచంద్ర, జ్యోతి, జనసేన నాయకులు డాక్టర్ మత్రివేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, జయజయహే :**

ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్అన్నారు..వేములవాడ పట్టణంలోని బస్ డిపో వద్ద గల 144 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ ఆర్ అండ్ బి మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయనిఅన్నారు..రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందనీ తెలిపారు. గత ప్రభుత్వంపదిసంవత్సరాలపాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేయలేదని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చెసి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందనీ తెలిపారు..బస్ డిపో వద్ద 144ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటికే గతంలో మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు..వాటి నిర్మాణం కోసం టెండర్ పక్రియ పూర్తి చేసి త్వరలోనే నిర్మాణాలను డిసెంబర్ 15 లోపు పూర్తి చేయాలని అధికారులకు విప్ సూచించారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, గృహ నిర్మాణ శాఖ పిడి శంకర్ ఆర్ అండ్ బి డి ఈ శాంతయ్య, వరప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు





### - నివాసితులు, వ్యాపారులు వ్యర్థాలను డస్ట్ బిన్లలో వేరుచేసి , క్లాప్ వాహనాలకు మాత్రమే అందించి సహకరించాలి

### - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, జయజయహే**

: రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అప్పగించి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. గురువారం తన పర్యటనలో కమిషనర్ 3, 4 జోన్ల పరిధిలోని 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుద్ధ్యం,పరిశుభ్రత పనులను పరిశీలించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. జోన్%-%3 పరిధిలో మద్దిలపాలెం జంక్షన్ నుండి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకు కిరువైపులా పరిశుభ్రత పనులను ఆయన పరిశీలించారు. స్పెన్సర్స్ జంక్షన్ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు గమనించిన కమిషనర్, అసంతృప్తి వ్యక్తం చేసి వెంటనే చెత్తను తొలగింపు చేయించి, బాధ్యులైన షాప్ యజమానులపై జరిమానా విధించాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌కు ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడం పై ఆయన షాపు యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తరువాత 17, 20 వార్డుల పర్యటనలో భాగంగా పెదవాల్తేరు గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ చెత్త తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని ఆదేశించారు. నివాసితులు, వ్యాపారులు తమ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని, వాడి పారేసిన కప్పులు, లేదా ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. చెత్తను నిర్లక్ష్యంగా వేస్తున్న వారిపై జరిమానాలు వసూలు చేయాలని, ఆ ప్రదేశాలను వెంటనే శుభ్రం చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్‌కు ఆదేశించారు. అనంతరం జోన్-4లోని 29వ వార్డులో దండు బజార్ వద్ద జీవీఎంసీ వార్డ్ కార్యాలయాన్ని సందర్శించి, పారిశుద్ధ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు నిరంతరం సహకరించాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది సమయానికి డ్యూటీకి హాజరు కావాలని, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ శానిటరీ సెక్రటరీలు రోజువారీ పర్యవేక్షణ చేపట్టి నగరాన్ని చెత్త రహితంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. వాకీ టాకీ ద్వారా కమిషనర్లు సంబంధిత ప్రాంతాల్లో సిబ్బంది, క్లాప్ వాహనాలను సక్రమంగా వినియోగించి ప్రతిరోజూ పరిశుభ్రత పై పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.




# జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ్‌కు ఘన వీడ్కోలు

### -అంకితభావంతో విధులు నిర్వహించి మెరుగైన పాలన అందించారు

### -జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**పాడేరు, జయజయహే :**

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్‌కు హృదయపూర్వక వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆయన సేవలను కొనియాడింది. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్‌గా ఒక సంవత్సరం, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఏడు నెలలు రెండు పదవులను ఒకేసారి నిర్వహించిన డాక్టర్ అభిషేక్ గౌడ్ అనుభవం భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం, కోటవురట్ల మండలంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 89 మంది పిల్లల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి ఆయన అహోరాత్రులు అంకితభావంతో యుద్ధ ప్రాతిపదికన కృషి చేశారని గుర్తు చేశారు. ఇటువంటి సమర్థవంతమైన అధికారులను జిల్లాకు కేటాయించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పర్యటనలు, అరకు చలి వత్సవం, 108 సూర్య నమస్కారాలు వంటి పెద్ద కార్యక్రమాలను జాయింట్ కలెక్టర్ సహకారంతో విజయవంతం చేయగలిగామని అన్నారు. జిల్లాకు తలమానికమైన కాఫీ పంటకు బెర్రీ బోరర్ అనే తెగులు సోకినప్పుడు నష్ట నివారణ చర్యలు చేపట్టడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. మంచి అభ్యాసకుడు, సమర్థవంతమైన పనితీరు గల వారితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్ ఏదైనా ఒక విషయంపై పూర్తిస్థాయిలో అవగాహన తెలుసుకునే వరకు వదిలిపెట్టే వారు కాదని, ఆయన గొప్ప మార్గదర్శకత్వం మరియు అపారమైన సహాయం అందించారని కొనియాడారు. అసిస్టెంట్ కలెక్టర్ కే. సాహిత్ మాట్లాడుతూ, శిక్షణ తర్వాత ఏఎస్ఆర్ జిల్లాకు పోస్టింగ్



వచ్చినప్పుడు టెన్షన్ పడ్డానని, కానీ సీనియార్టీతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో జాయింట్ కలెక్టర్ వారితో పనిచేయడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆకాంక్ష జిల్లా అయిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేయడం వల్ల చాలా నేర్చుకున్నానని అన్నారు. పాలనాపరంగా సహాయ సహకారాలు అందించిన జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.వి. సందీప్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ కే. సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలతతో పాటు పలువురు జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, పాడేరు ఐటీడీఏ సిబ్బంది మరియు పలు మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్లకు కలిసొచ్చిన సానుకూల సంకేతాలు

## 25,500 దాటిన నిఫ్టీ

### వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### 862 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 261 పాయింట్లు లాభపడిన నిఫ్టీ

### 25,585 వద్ద ముగిసిన నిఫ్టీ

### దాదాపు అన్ని రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు

### ఎఫ్ఎంసీజీ, రియాల్టీ రంగాల షేర్లు భారీగా లాభపడ్డాయి



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా లాభాల జోరును కొనసాగించాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. ముఖ్యంగా కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాలతో పాటు, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. దీంతో కొనుగోళ్ల జోరు వెల్లువెత్తింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 862.23 పాయింట్లు (1.04 శాతం) ఎగబాకి 83,467.66 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 261.75 పాయింట్లు (1.03 శాతం) లాభపడి 25,585.3 వద్ద ముగిసింది. ఈ ర్యాలీతో నిఫ్టీ కీలకమైన 25,500 పాయింట్ల మార్కును అధిగమించింది.

అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం, భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నెలకొన్న ఆశలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం పుంజుకోవడం వంటి అంశాలు మార్కెట్లకు కలిసొచ్చాయి. అలాగే, డాలర్ ఇండెక్స్ బలహీనపడటం, రూపాయి విలువ పుంజుకోవడం కూడా సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. మూడో త్రైమాసికంలో డిమాండ్ పుంజుకుంటుందన్న అంచనాలు కూడా మార్కెట్లకు ఊతమిచ్చాయి. ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియాల్టీ రంగాలు వరుసగా 2.02%, 1.90% మేర లాభపడి ర్యాలీకి నాయకత్వం వహించాయి. అయితే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ మాత్రం 0.44% నష్టపోయింది. విస్తృత మార్కెట్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.46%, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.24% చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ షేర్లలో టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ లాభాలు ఆర్జించగా... ఇన్ఫోసిస్, ఎటర్నల్ షేర్లు మాత్రం నష్టాలను చవిచూశాయి. సాంకేతికంగా నిఫ్టీ కీలకమైన అవరోధాలను దాటిందని, రానున్న రోజుల్లో 25,800 నుంచి 26,000 స్థాయిలకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు, ప్రపంచ వాణిజ్య పరిణామాలు మార్కెట్ల దీర్ఘకాలిక పనితీరును నిర్దేశిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.




## బెదిరింపులు పాల్పడుతున్న రిపోర్టర్లపై కేసు నమోదు, రిమాండ్

### వివరాలు వెల్లడించిన వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్.

**వేములవాడ, జయజయహే**

వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మేల మహిపాల్ అనే వ్యక్తి వృత్తి పరంగా ఒగ్గు కళాకారుడు.గంగాదేవిని పూజిస్తూ,సపుదలమ్మ పూజలు చేస్తూ,మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. వేములవాడ పట్టణానికి చెందిన తొగరి కరుణాకర్ అనే వ్యక్తి జర్నలిస్ట్ ముసుగులో తేదీ 11-10-2025 రోజున మహిపాల్‌కు ఫోన్ చేసి నువ్వు వేములవాడకు రావాలని రాకపోతే నీపై సి.సి.ఎస్. పోలీసులకు ఫిర్యాదు చేస్తా అని బెదిరించాగా మహిపాల్ వేములవాడకు వచ్చి కరుణాకర్‌ను కలుసుకోని ఏ విషయం పై నాపై పిర్యాదు చేస్తావ్ అని కరుణాకర్ ని అడుగగా పొంతన లేని సమాధానాలు చెప్పడమే కాకుండా నీ గురించి నీ భార్య పిల్లల గురించి మా పేపర్ లో రాస్తా అని బెదిరించాడు.మరుసటి రోజు కరుణాకర్ మరోసారి ఫోన్ చేసి,నువ్వు ఒకరిని మోసం చేశావని మా పేపర్‌లో రాయమని వాళ్ళు వచ్చి చెప్పారని, రాయకుండా ఉండాలంటే నాకు మరియు క్రైమ్ రిపోర్టర్‌గా రాజుకి 30,000/- రూపాయలు ఇవ్వాలనిడిమాండ్ చేసాడు.భయభ్రాంతులకు గురైన మహిపాల్ 14-10-2025న సాయంత్రం 6:46 గంటలకు ఫోన్‌పే ద్వారా రూ.10,000/- చెల్లించాడు. అయినప్పటికీ వారు రూ.20,000/- ఇవ్వాలని మళ్లీ బెదిరించారు.ఈసంఘటనపై బాధితుడు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కరుణాకర్ మరియు రాజు అనే ఇద్దరిపై ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి తోగరి కరుణాకర్ ను రిమాండ్ కు తరలించడం జరిగింది . మరియు రాజు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. కరుణాకర్ మరియు రాజులకు సంబంధించిన బాధితులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని,మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

## వీడిన మహిళ హత్య కేసు

**జయజయహే :**

విశాఖ నందగిరినగర్‌లో జరిగిన మహిళ హత్య కేసు నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. నిందితుడు శ్రీనివాస్, మృతురాలు ఒకే కాలనీలో ఉండేవారని విశాఖ ఈస్ట్ జోన్ ఏసీపీ లక్ష్మణమూర్తి వివరాలు తెలియజేశారు. ఇరువురి మధ్య గతం నుంచే విభేదాలు ఉన్నాయని తెలిపారు. కొద్దిరోజుల క్రితం నిందితుడు శ్రీనివాస్ మరో మహిళతో చనువుగా ఉండటాన్ని మృతురాలు ప్రశ్నించింది. ఈ క్రమంలోనే నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడని తెలిపారు.

## అమరావతిలో దస్‌పల్ల ఫోర్ స్టార్ హోటల్‌కు అనుమతి

**జయజయహే :**

అమరావతి లో 4 స్టార్ దసపల్లా హోటల్ నిర్మాణానికి ప్రోత్సాహకాలతో ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.200 కోట్లతో 4 స్టార్ హోటల్‌ని దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనుంది. దసపల్లా హోటల్ నిర్మాణంతో 400 మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్ర పన్నులు, స్టాంప్ డ్యూటీ వందశాతం తిరిగి చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల తరహాలో విద్యుత్ చార్జీలు విధింపు, ఐదేళ్లకు విద్యుత్ సుంకం తిరిగి చెల్లించాలని నిర్ణయించింది. టూరిజం పాలసీ 2024 నుంచి 2029 ప్రకారం పలు రాయితీలు ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజైయ్ జైన్ ఆదేశాలు జారీ చేశారు.




## ఆసియా కప్ హీరో తిలక్ వర్మకు సన్మానం

### సన్మానం చేసిన మన శంకర వరప్రసాద్ గారు

**జయజయహే :**


ఆసియా కప్ హీరో, యువ క్రికెటర్ తిలక్ వర్మ మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా సెట్ కు వచ్చిన తిలక్ వర్మను చిరు సత్కరించారు. ఇటీవల ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై టీమిండియా సాధించిన ఘన విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన యువ సంచలనం తిలక్ వర్మ టాలెంట్, అంకితభావం , పోరాట స్ఫూర్తిని మెగాస్టార్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాగంగా, మూవీ సెట్‌లో తిలక్ వర్మ కేక్ కట్ చేశారు. చిరంజీవి స్వయంగా అతనికి ఆసియా కప్ నాటి ప్రత్యేక ఫోటోను బహుమతిగా అందించారు. ఈ అరుదైన క్షణంలో చిరంజీవితో పాటు హీరోయిన్ నయనతార, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి, కాస్ట్యూమ్ డిజైనర్ సుష్మిత కొణిదెల కూడా పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



## కాంతారా చాప్టర్1కు దీపావళి వెలుగులు

హిట్ మూవీ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా తెరకెక్కి ఆ చిత్రానికి మించిన విజయం అందుకుంది 'కాంతార చాప్టర్ అక్టోబరు 2న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా 12 రోజుల్లో రూ.675 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. దీపావళిని పురస్కరించుకుని కొత్త ట్రైలర్ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలతో రూపొందించిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటించిన సంగతి తెలిసిందే.



## పెద్ది నుంచి త్వరలో లవ్ సాంగ్

### దర్శకుడు బుచ్చిబాబు

రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు.



## వరుస సినిమాలతో అనుపమ దూకుడు

మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన 'డ్రాగన్' మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది.అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో 'సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాడ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో 'రాక్షసుడు' మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'బైసన్' తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది.


## సక్సెస్ కోసం రవితేజ ఎదురుచూపు

### 31న వస్తున్న మాస్ జాతర



మాస్ మహారాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా'తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలగ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.

## రశ్మిక మైసా సంగీత దర్శకుడుగా జేక్స్ బిజోయ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన నటిస్తున్న పవర్ ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా' ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో పాన్-ఇండియా స్థాయిలో 'మైసా' సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. నాని నటించిన 'సరిపోదా శనివారం' చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ను 'మైసా' చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ సౌండింగ్ అదిరిపోయింది. 'మైసా' మ్యూజికల్‌గా గ్రాండ్ స్కేల్ లో వుండబోతుందని ఈ వీడియో చూస్తే అర్థమౌతోంది. 'మైసా' గోండు తెగల బ్యాక్ డ్రాప్ లో హై-ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతోంది. రశ్మిక మందణ్ణ ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించనుంది. ఈ సినిమాకు సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ ని 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.





## వెట్రిమారన్ తెలుగు సామ్రాజ్యం

### ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల

తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు. ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా 'సామ్రాజ్యం' ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com